విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 255 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ బుధవారం 4 ఫిబ్రవరి 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో

# కోకో సిటీ



- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టులు కోళ్ల రైతులకే
- లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు అనుమతులు
- మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల సమస్యలు పరిష్కరిస్తాం
- వ్యవసాయ అనుబంధ రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను కోళ్ల రైతులకే ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కోళ్ల రంగాన్ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని, అందులో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సహా అన్నిటికి చోటు కల్పించాలని సూచించారు. లంబసింగిలో గిరిజనుల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. మంగళ వారం సాయంత్రం ఆయన సచివాలయంలో వ్యవసాయ అనుబంధశాఖలపై సమీక్షించారు. 'ఆంధ్రప్రదేశ్‌ను అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. దీన్ని 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులు, 50 లక్షల ఎకరాలకు విస్తరించాలి' అని చెప్పారు. 'ప్రకృతి ఉత్పత్తుల సాగు నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సౌకర్యాలను జూన్ నాటికి కల్పించాలి.

- మిగతా 2లో

## అక్రంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు




రాష్ట్రంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల పై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్(ట్విట్టర్) వేదికగా ట్వీట్ పెట్టారాయన. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అది ప్రభుత్వానికి చెడ్డ పేరు

- మిగతా 2లో



## భారత్ కు అమెరికా నుంచి బెస్ట్ డీల్ వచ్చింది

న్యూ దిల్లీ, ఫిబ్రవరి 03: అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందానికి ఇరు దేశాలు అంగీకరించాయి. దీనివల్ల ప్రస్తుతం భారతీయ ఉత్పత్తుల పై 25 శాతం ఉన్న సుంకాలు గణనీయంగా 18 శాతానికి తగ్గాయి. అయితే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం పై కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ డీల్ పై హర్షం వ్యక్తం చేశారు. భారత్ కు అమెరికా నుంచి బెస్ట్ డీల్ కుదిరిందని తెలిపారు. భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం పై కేంద్ర మంత్రి పీయుష్ గోయల్

- మిగతా 2లో



## వ్యవసాయం పై తలవంచని భారత్, ట్రేడ్ డీల్ పై క్లారిటీ

న్యూ దిల్లీ, ఫిబ్రవరి 03: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. భారత్ అమెరికా ఉత్పత్తులను భారీగా కొనుగోలు చేయడానికి అంగీకరించిందని ట్రంప్ వెల్లడించడంతో, వ్యవసాయం, ఇంధనం, సుంకాల పై అనేక సందేహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ వర్గాలు రంగం లోకి దిగాయి. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్ట మైన సంకేతాలు ఇచ్చాయి. అమెరికా నుంచి దిగుమతి అయ్యే వ్యవసాయ, పాడి ఉత్పత్తుల పై సుంకాలను తగ్గించేందుకు

- మిగతా 2లో

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం

# పెద్ద నిర్ణయం

### ప్రధాని మోదీకి సన్మానం



- వాణిజ్య ఒప్పందం కోసం మోదీ చేసిన కృషికి గాను సన్మానం
- ప్రధానిని పార్లమెంటు ఆవరణలో సన్మానించిన ఎన్డీయే ఎంపీలు
- 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అంటూ నినాదాలు

భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే ఎంపీలు సన్మానం చేశారు. ఈ ఒప్పందం కోసం మోదీ చేసిన కృషికి గాను వారు సన్మానం చేశారు. ఈ సన్మానం సమయంలో ఎంపీలు 'భారత్ మాతాకీ జై',

- మిగతా 2లో

## రైతుల రక్తం, శ్రమను ప్రధాని మోదీ

# అమ్ముకున్నారు

భారత్- అమెరికా మధ్య తాజాగా హఠాత్తుగా కుదిరిన వాణిజ్య ఒప్పందం పై లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి మరీ ఈ ఒప్పందం చేసుకున్నారంటూ ప్రధాని మోదీ పై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం






- మిగతా 2లో

## దిల్లీ చేరుకున్న మంత్రి లోకేశ్

- కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు
- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి

- మిగతా 2లో





## మయన్మార్‌లో భూకంపం...

### కోల్‌కతాలోనూ ప్రకంపనలు

- మయన్మార్‌లో 5.9 తీవ్రతతో సంభవించిన భూకంపం
- కోల్‌కతా, బంగ్లాదేశ్‌లోనూ కనిపించిన ప్రభావం
- భూమికి 63 కి.మీ. లోతున భూకంప కేంద్రం గుర్తింపు
- ప్రస్తుతానికి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం నమోదు కాలేదు

మయన్మార్‌లో మంగళవారం రాత్రి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.9గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం మయన్మార్‌లో ఉన్నప్పటికీ, దీని ప్రభావం భారత్‌లోని పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాతో పాటు బంగ్లాదేశ్‌లోనూ స్పష్టంగా కనిపించింది.

- మిగతా 2లో



## విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్రభుత్వ

# సహాయ సహకారాలు

### స్టీల్ ప్లాంట్ పురోగతి పై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 03: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ కు పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఉంటాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. మంగళవారం నాడు రాజధాని అమరావతి లోని వెలగపూడి సచివాలయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పురోగతి పై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాల్లో కొత్త విధానాలు ప్రవేశపెట్టి ప్లాంట్ ను మరింత బలోపేతం చేయాలని వారికి సూచించారు. అలాగే కార్మికులు, ఉద్యోగుల సమర్థ వినియోగంతో మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యాజమాన్యం, కార్మికులు, ప్రభుత్వాలు కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ ను విజయపథంలో నడపాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సింగరేణి సంస్థలో అమలు చేసిన సంస్కరణలు, కార్మికుల సహకారంతో సాధించిన ఫలితాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. మరో వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల

- మిగతా 2లో

## భారత్ చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని మాతో చెప్పలేదు..

### రష్యా స్పందన....

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ ట్రంప్ చేసిన ప్రకటన పై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందించారు. ఈ విషయంలో దిల్లీ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదని చెప్పారు.మంగళవారం క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి

- మిగతా 2లో



# ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ

-మొదటిపేజీ తరువాయి

ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతా శిక్షణ తరగతులు నిర్వహించాలి' అని సూచించారు.

విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్..

విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మాణానికి చంద్రబాబు ఆమోదం తెలిపారు. డిజి రైతుబజార్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్‌లను ప్రారంభించారు. ఇందులో 9,512 యంత్రాలు ఉన్నాయని, రైతులు తమకు అవసరమైనవి వీటిద్వారా బుక్‌చేసి తీసుకోవచ్చన్నారు. అమెరికా, ఈయూతో వాణిజ్య ఒప్పందాలతో రైతులకు అవకాశాలుఅమెరికా, యూరోపియన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల వల్ల రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు అవకాశం కలిగిందని, అయితే నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని చంద్రబాబు చెప్పారు. ఎంవోయూ కుదుర్చుకున్న ఆహారశుద్ధి సంస్థలు త్వరితగతిన యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'మామిడి, కోకో, జీడి, కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగుకు అవకాశాలున్నాయి. రైతుల్ని ఆ దిశగా ప్రోత్సహించాలి. అరటి ఎగుమతుల్లో వెనకబడ్డాం. దానిపై దృష్టి పెట్టాలి' అని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర విధానాలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని సూచించారు.

**పంటల వారీ పండగలు**

'కుప్పంలో పూల పండగ నిర్వహించిన విధంగానే.. రాష్ట్రంలో సాగయ్యే పంటలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో పండగలు నిర్వహించాలి. పర్యాటక రంగ అభివృద్ధికి ఇది దోహదపడుతుంది. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ పెరుగుతుంది. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైలు బోగీలు ఏర్పాటు చేసేలా చూడాలి. కవర్లతో మామిడికి నాణ్యత, మంచి ధర వచ్చింది. జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలకూ దీన్ని అమలు చేయాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయం పై తలవంచని భారత్, ట్రేడ్ డీల్ పై క్లారిటీ

-మొదటిపేజీ తరువాయి

భారత్ గతం నుంచే అంగీకరించలేదని, ఇప్పటికీ అదే నిర్ణయం పై నిలబడి ఉందని ప్రభుత్వ వర్గాలు పునరుద్ఘాటించాయి. ఈ రంగాలు అత్యంత సున్నిత మైనవని, దేశీయ రైతులను దెబ్బతీసే నిర్ణయాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోబోమని తేల్చిచెప్పాయి. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులే అసలు చిక్కు అమెరికా ప్రభుత్వం తన రైతులకు భారీ సబ్సిడీలు అందిస్తుంది. దీంతో వారు తమ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకు ఎగుమతి చేయగలుగుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఉత్పత్తి ఖర్చుకంటే కూడా తక్కువ ధరలకు సరుకులు విదేశాలకు చేరుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సుంకాలను తగ్గిస్తే, దేశీయ రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ట్రేడ్ డీల్ చర్చల్లో ఇంతకాలంగా ప్రతిష్టంభన కొనసాగడానికి ఇదే ప్రధాన కారణమని వర్గాలు వెల్లడించాయి. వెనెజువెలా చమురు కొనుగోలు పై స్పష్టత, ఇంధన సరఫరా అంశంలోనూ ప్రభుత్వం తన వైఖరిని వివరించింది. అంతర్జాతీయ ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు వెనెజువెలా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయలేదని, ఇప్పుడు ఆ ఆంక్షలు ఎత్తివేయడంతో మార్కెట్ ధరలకు అనుగుణంగా కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపింది. ఇంధన దిగుమతుల విషయంలో దేశ ప్రయోజనాలే ప్రధానం అని స్పష్టం చేసింది. మూడు రోజుల క్రితం డొనాల్డ్ ట్రంప్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇరాన్ కు బదులుగా వెనెజువెలా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే దిశగా చర్చలు జరిగాయని వ్యాఖ్యానించారు. ట్రంప్-మోదీ చర్చల తర్వాత ప్రకటన సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ తో టెలిఫోన్ సంభాషణ అనంతరం ట్రంప్ ఈ ట్రేడ్ డీల్ విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు. ఆయన ప్రకారం, భారత ఉత్పత్తుల పై అమెరికా విధిస్తున్న 25 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గించనున్నారు. అయితే, ఈ వాణిజ్య ఒప్పందం గురించి ప్రధాని మోదీ ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. సుంకాల తగ్గింపును మాత్రమే ఆయన ధ్రువీకరించారు. ఆర్థికంగా లాభం, కానీ కీలక రక్షణలు యథాతథం ప్రభుత్వ వర్గాల అంచనా ప్రకారం, ఈ ఒప్పందం ద్వైపాక్షిక వాణిజ్యానికి అనుకూల వాతావరణాన్ని సృష్టించనుంది. రాబోయే సంవత్సరాల్లో భారత్-అమెరికా వాణిజ్య లక్ష్యం అయిన 500 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నాయి. అయితే, వ్యవసాయం, పాడి పరిశ్రమ వంటి కీలక రంగాలకు సంబంధించిన రక్షణల పై మాత్రం ఎలాంటి రాజీ లేదని స్పష్టంచేశాయి. గత ఏడాది రష్యా చమురు కొనుగోళ్ల అంశం పై అమెరికా విధించిన భారీ సుంకాలతో భారత్-అమెరికా సంబంధాలు తీవ్ర ఒత్తిడికి లోనైన నేపథ్యంలో, తాజా పరిణామాలు వ్యూహాత్మకంగా కీలకంగా మారాయి. దేశీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## రైతుల రక్తం, శ్రమను ప్రధాని మోదీ అమ్ముకున్నారు

-మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ లో రాష్ట్రపతి ప్రసంగం పై ధన్యవాద తీర్మానం పై రాహుల్ మాట్లాడకుండా బీజేపీ సభ్యులు తీవ్ర ఆటంకాలు సృష్టించారు. దీంతో సభ వాయిదా పడింది. అనంతరం బయటికి వచ్చిన రాహుల్ మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ భయపడుతున్నారని, అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయి ఉందని, కానీ ఇవాళ ఎలాంటి కారణం లేకుండానే డీల్ జరిగిపోయిందన్నారు. మోదీ నిన్న సాయంత్రం ఈ డీల్ పై సంతకం చేశారని గుర్తుచేశారు. ఆయన పై తీవ్ర ఒత్తిడి ఉందన్నారు. మోదీ కి ఇమేజ్ పోతుందనే భయం పట్టుకుందన్నారు. మాజీ ఆర్మీ ఛీఫ్ నరవణే పుస్తకంలో అంశాల పేరుతో తనను అడ్డుకున్నారని, కానీ ఇది అసలు విషయం కాదన్నారు. ఇది ప్రజలు గమనించాలన్నారు. లోక్ సభలో విపక్ష నేతను రాష్ట్రపతి ప్రసంగం పై ధన్యవాదాలు చెప్పకుండా తొలిసారి అడ్డుకున్నారన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా మన దేశంలో రైతుల రక్తం, శ్రమను ప్రధాని మోదీ అమ్ముకున్నారన్నారు. వారితో పాటు దేశాన్ని కూడా అమ్మేశారన్నారు. మోదీ భయపడుతున్నారని, ఎందు కంటే ఆయనకు ఈ ఇమేజ్ తెచ్చినవారే దాన్ని చెడగొడుతున్నారన్నారు. అమెరికా ప్రభుత్వం అదానీనీ టార్గెట్ చేయడం లేదని, మోదీ ఆర్థిక బలాన్ని టార్గెట్ చేస్తోందన్నారు. అలాగే ఎప్ స్టీన్ ఫైల్స్ ద్వారా మోదీ ని టార్గెట్ చేస్తున్నారన్నారు. ఎప్ స్టీన్ ఫైల్స్ ను అమెరికా ఇంకా విడుదల చేయలేదన్నారు. ఈ రెండు అంశాలు ప్రధాని మోదీ రాజీపడ్డారనే దానికి నిదర్శనం అన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్రభుత్వ సహాయ సహకారాలు

-మొదటిపేజీ తరువాయి

సహకారంతో ఏడాదిన్నరలో విశాఖ స్టీల్ ప్లాంట్ అనూహ్య ప్రగతి సాధించింది. గతంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) ప్రస్తుతం లాభాల బాట పట్టింది. హాట్ మెటల్ ప్రొడక్షన్‌లో రోజుకు 19,401 టన్నుల ఉక్కు ఉత్పత్తికి ఈ సంస్థ చేరుకుంది. 2024-25 రెండో త్రైమాసికం (సెకండ్ క్వార్టర్)లో కేవలం రోజుకు 9,215 టన్నుల మాత్రమే ఈ సంస్థ ఉత్పత్తి చేసేది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పని చేస్తుండడంతో భారీగా ఉత్పత్తి పెరిగింది. స్టీల్ ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్‌లో రికార్డు స్థాయిలో 94 శాతానికి చేరుకుంది. 2024-25 రెండో త్రైమాసికం (సెకండ్ క్వార్టర్)లో కేవలం రోజుకు 45 శాతం మాత్రమే ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. ఈ ఆర్థిక నష్టాల నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో దూసుకెళ్తోంది. 2024 సెప్టెంబర్‌లో ఎదుర్కొన్న రూ.486 కోట్ల నష్టాల నుంచి గట్టెక్కి 2026 జనవరిలో రూ.54 కోట్ల లాభాన్ని విశాఖ స్టీల్ సాధించింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11 వేల కోట్ల సాయంతో విశాఖ స్టీల్ నిలదొక్కుకుంది. ప్రస్తుతం ఈ స్టీల్ ప్లాంట్ కు క్రెడిట్ రేటింగ్ పెరిగినట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీఎండీ మనీష్ రాజ్ గుప్తా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మయన్మార్‌లో భూకంపం...

-మొదటిపేజీ తరువాయి

పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

అందుకున్న సమాచారం ప్రకారం, మయన్మార్‌లోని మాగ్వే రీజియన్‌లో, యెనాంగ్యాంగ్ పట్టణానికి 95 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూమికి 63 కిలోమీటర్ల లోతున, స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10:04 గంటలకు ఈ భూకంపం సంభవించింది. కోల్‌కతాతో పాటు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోనూ ప్రజలు భూప్రకంపనలను స్పష్టంగా గుర్తించారు. ఈ భూకంపం వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సోమవారం అండమాన్, నికోబార్ దీవుల్లో 4.6 తీవ్రతతో భూకంపం వచ్చిన మరుసటి రోజే మయన్మార్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## భారత్ చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని మాతో చెప్పలేదు..

-మొదటిపేజీ తరువాయి

పెస్కోవ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో వాణిజ్య ఒప్పందం ప్రకటించిన తర్వాత కూడా భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందని ఎటువంటి ప్రకటన ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటివరకు న్యూ ఢిల్లీ నుండి మాకు ఎటువంటి ప్రకటనలు రాలేదు అని పెస్కోవ్ ఏఎఫ్పీ మరియు ఇతర విలేకరులతో అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ తో ఒక వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ ఒప్పందంలో, రష్యన్ చమురు కొనుగోళ్లను నిలిపివేయడం లేదా తగ్గించడం అనే అంశం చర్చించబడినట్లు ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ ప్రకారం, మోదీ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే, ఈ హామీ పై న్యూ ఢిల్లీ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన పై క్రెమ్లిన్ స్పందించింది. వాషింగ్టన్-న్యూ ఢిల్లీ మధ్య ట్రేడ్ ఒప్పందం కుదిరిందంటూ ట్రంప్ తన 'ట్రూత్'లో పోస్ట్ చేశారు. రష్యన్ చమురు కొనుగోళ్లను ఆపడానికి, అమెరికా, వెనెజువెలా నుంచి కొనుగోలు చేయడానికి భారత్ అంగీకరించినట్టు ట్రంప్ ప్రకటించారు. దీని పై మోదీ వెంటనే స్పందించారు. భారత ఉత్పత్తుల పై ఇక నుంచి 18 శాతమే అమెరికా సుంకాలు అమలవుతాయని, ఇది సంతోషకరమని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసే విషయం పై ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. ఇండియాతో విలువైన సంబంధాలు రష్యా: రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ ట్రంప్ చేసిన ప్రకటన పై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడారు. ఈ విషయంలో న్యూ ఢిల్లీ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని చెప్పారు. భారత్ తో తమకు విలువైన సంబంధాలు ఉన్నాయని, ఇరుదేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగ్యస్వామ్యం కొనసాగుతుందని చెప్పారు. అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మేము గౌరవిస్తున్నాం. అయితే రష్యా-ఇండియా మధ్య కీలక రంగాల్లో అత్యంత లోతైన, విస్తృతమైన సహకారం కూడా ఏమాత్రం తక్కువ కాదు. ఇది మాకు అత్యంత ముఖ్యం కూడా, ఢిల్లీతో మా ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తృత పరుచుకోవాలన్నదే మా అభిమతం అని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధ 2022 లో ప్రారంభ మైన తర్వాత రష్యా నుంచి డిస్కౌంట్ తో ముడిచమురును కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్ కీలకంగా ఉంది. ఇది పశ్చిమ దేశాలకు కన్నెర్ర అవుతోందిని వివరించారు.

## ఢిల్లీ చేరుకున్న మంత్రి లోకేశ్

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆయన పార్లమెంటులో పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేసిన నేపథ్యంలో అందులో రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే అంశాల గురించి ఆయన కేంద్ర మంత్రులతో చర్చించనున్నట్లు తెలిసింది. మంగళవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న వెంటనే ఆయన పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. బడ్జెట్‌పై ప్రజాస్పందన, వివిధ వర్గాల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వర్తమాన రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. బుధవారం రాత్రి లోకేశ్ తిరిగి విజయవాడ వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## అక్రంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

కూడా తెస్తోందని పేర్కొన్నారు. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. సంబంధిత శాఖ అధికారులు మద్యం దుకాణాల పై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. అధిక ధరలకు విక్రయించే మద్యం వారి పై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

'వందేమాతరం' అంటూ నినాదాలు చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. ఈ భేటీ నేపథ్యంలో మొదట మోదీని సన్మానించారు. అనంతరం పార్లమెంటులో ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశనం చేశారు.కాగా, భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి ఇరు దేశాలు అంగీకరించిన విషయం తెలిసిందే. భారత్‌పై ప్రతీకార సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై 50 శాతం సుంకం ఉండగా ఇప్పుడు అది 18 శాతానికి తగ్గుతుంది. ఈ 50 శాతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. ఇప్పుడు అదనపు సుంకాలను తొలగిస్తున్నట్లు అమెరికా తెలిపింది.

## భారత్ కు అమెరికా నుంచి బెస్ట్ డీల్ వచ్చింది

-మొదటిపేజీ తరువాయి

హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య జరిగిన ఈ ఒప్పందం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా బలపడుతుందని పేర్కొన్నారు. వాణిజ్య పరంగా అనేక అవకాశాలను ఈ డీల్ ఇస్తుందని తెలిపారు. ఈ మేరకు అమెరికాతో మంచి ఒప్పందం జరిగిందని స్పష్టం చేశారు. ఈ ఒప్పందంతో భారత్ లోని రైతులు ఏమాత్రం నష్టపోరని తెలిపారు. భారత్ కు ముమ్మందు శుభ ఫలితాలు సమకూరుతాయని పీయుష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ మేరకు భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం పై భారత్, అమెరికా ప్రజలకు అభినందనలు తెలిపారు మంత్రి పీయుష్ గోయల్. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలను బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ, ట్రంప్ ప్రదర్శించిన దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, నిబద్ధతకు కృతజ్ఞతలు అని పీయుష్ గోయల్ పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య జరిగిన ఈ ఒప్పందం రైతులు, కార్మికులు, పారిశ్రామిక వేత్తలకు అవకాశం కల్పిస్తోందన్నారు. ఇరు దేశాల మధ్య జరిగిన ఈ డీల్ కేవలం కేవలం ఒప్పందం మాత్రమే కాదని భారత్- అమెరికా మధ్య సంబంధాలను పునర్నిర్మించే దిశ మాత్రమే కాకుండా వికసిత్ భారత్- 2047 కు కీలక మలుపు అని స్పష్టం చేశారు. ఇక సోమవారం ఫిబ్రవరి 2 న భారత్- అమెరికా మధ్య వాణిజ్య సంబంధంలో కీలక పరిణామం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. భారతీయ వస్తువుల పై ఇప్పటికే ఉన్న 25 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని మోదీ తో ఫోన్ కాల్ అనంతరం ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమ మైన ట్రూత్ సోషల్ లో ఇదే విషయం పై పోస్టు చేశారు. ఇవాళ ప్రధాని మోదీ తో మాట్లాడాను. ఆయన నాకు గొప్ప స్నేహితుడు, అలాగే శక్తివంత మైన నాయకుడు అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును ఆపడానికి.. యూఎస్, వెనిజులా నుంచి కొనుగోలు చేయడానికి ఆయన అంగీకరించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదిరింది అని ట్రంప్ పేర్కొన్నారు.

## గోవా, కర్ణాటక వెళ్లాలనుందా?.. ఆర్టీసీ స్పెషల్ ప్యాకేజీలు

### ఒక్కో టికెట్ ధర రూ. 5,130

### గోవా, మురుడేశ్వర, ఉడిపి యాత్ర

### శ్రీశైలానికి రోజూ ఏసీ సర్వీసులు

### మార్చి 6న తుల్జాపూర్ స్పెషల్ బస్సు



ప్రయాణికులకు విహారయాత్రలను మరింత చేరువ చేస్తూ టీజీఆర్టీసీ బంపర్ ఆఫర్లు ప్రకటించింది. పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధ వెల్లడించారు. ఈ వేసవి ముందే పర్యాటకులు తమ ట్రిప్ ప్లాన్ చేసుకునేలా తక్కువ ధరలో సుదూర ప్రాంతాలకు బస్సులు అందుబాటులోకి తెచ్చారు.ఈ నెల 25న బీహెచ్ఈఎల్ లింగంపల్లి నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. ఈ టూర్ మార్చి 1న తిరిగి లింగంపల్లికి చేరుకుంటుంది. ఈ యాత్రలో భాగంగా కర్ణాటకలోని ప్రసిద్ధ కుక్కి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, ఉడిపి, మురుడేశ్వర ఆలయాలతో పాటు గోవాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. ఈ టూర్ ప్యాకేజీ ధర ఒక్కో ప్రయాణికుడికి కేవలం రూ. 5,130 గా నిర్ణయించారు.రామచంద్రాపురం, బీరంగూడ నుంచి శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం ప్రతిరోజూ సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ సర్వీసులను నడుపుతున్నారు. దీనికోసం అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉంది.మార్చి 6న బీహెచ్ఈఎల్ డిపో నుంచి తుల్జాపూర్ భవానీ మాత సందర్శనార్థం ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. ఈ ట్రిప్‌లో గానుగాపూర్, కొల్హాపూర్, పండరీపూర్ క్షేత్రాలను కూడా దర్శించుకోవచ్చు. దీనికి ఒక్కొక్కరికి రూ. 3,000 చార్జీ వసూలు చేయనున్నారు. ఆసక్తి గల ప్రయాణికులు అధికారిక వెబ్‌సైట్ www.tgsrtcbus.in ద్వారా లేదా ఏటీబీ ఏజెంట్ల వద్ద టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

# నున్నలో రూ.4.36 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన యార్లగడ్డ





- విజయవాడ రూరల్ 9 గ్రామాలు వీఎంసీలో విలీనం చేయాలి.
- రూరల్ గ్రామాల సమస్యలకు వీఎంసీ లో విలీనమే పరిష్కారం.
- తిరుమల లడ్డూ అంశంలో రాజకీయాలు సరికాదు.
- సీఎం పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి అరెస్ట్ సమంజసమే.
- రాజకీయాల్లో భాషా నియంత్రణ అవసరం.

**గన్నవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 03**: నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలం లోని తొమ్మిది గ్రామాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ చేశారు. గతంలో ఈ గ్రామాలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్న సమయంలో తగిన నిధులు అందేవని, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో ఉండటంతో నిధుల కొరత ఏర్పడి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడ రూరల్ మండలం నున్న పంచాయతీ పరిధిలో నున్న బైపాస్ రోడ్డు అభివృద్ధికి 2.36 కోట్ల రూపాయలు, విజయవాడ--నూజివీడు రోడ్డులో 10 వ కిలో మీటర్ నుంచి 16 వ కిలో మీటర్ వరకు రోడ్డు పనుల కోసం 2.70 కోట్ల రూపాయలు, మొత్తం 4.36 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామవరప్పాడు వంటి గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, మురుగునీటి సమస్యతో పాటు తాగునీటిలో టీడీఎస్ స్థాయి ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో విజయవాడ రూరల్ లోని తొమ్మిది గ్రామాలను వీఎంసీలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. నున్న సెంటర్ విస్తరణ కోసం మరో 4.5 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని మంత్రిని కోరామని, త్వరలోనే ఆ నిధులు కూడా విడుదల అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నున్న సెంటర్ వద్ద రోడ్డు వెడల్పు కేవలం 30 నుంచి 35 అడుగుల వరకు మాత్రమే ఉండటంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని 80 నుంచి 90 అడుగుల వరకు విస్తరించడమే లక్ష్యమని చెప్పారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా, అందరికీ నచ్చజెప్పి ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. వీఎంసీలో విలీనం చేస్తే పన్నులు పెరుగుతాయనే అపోహలు అవసరం లేదని సీఆర్‌డీఏ పరిధిలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన పన్నులు అమలులో ఉన్నాయని తెలిపారు. తిరుమల లడ్డూ అంశంలో రాజకీయాలు చేయడం సరికాదని యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యానించారు. దేవుడు అందరికంటే పైన ఉంటాడని, ఆయన్ను వివాదాల్లోకి లాగడం తన మనస్సాక్షికి నచ్చదని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు వంటి వారిని అరెస్ట్ చేయడం సమంజసమేనని ఆయన సమర్థించారు. రాజకీయ నాయకులు భాషా నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉందని, గతంలో పత్రికలు ఇలాంటి బూతు వ్యాఖ్యలను ప్రచురించేవి కావని, ఇప్పుడు లైవ్ మీడియా కారణంగా హద్దులు దాటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుంటేనే పరిశ్రమలు వస్తాయని పేర్కొన్న ఆయన, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఏర్పడిందన్నారు. అందుకే మల్లవల్లి, వీరపనేని గూడెం వంటి ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తున్నాయని, వాటి ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. దొంగ శంకుస్థాపనలు చేయడం, కేవలం శిలాఫలకాలకే పరిమితమవ్వడం తనకు ఇష్టం లేదని, అభివృద్ధినే అజెండాగా తీసుకుని ముందుకు సాగుతానని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, నున్న గ్రామ టిడిపి అధ్యక్షులు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, విజయవాడ రూరల్ మండల తెలుగు యువత అధ్యక్షులు గంపా శ్రీనివాస్ యాదవ్, టిడిపి నాయకులు గుజ్జర్లపూడి బాబురావు, మాదు శివరాంప్రసాద్, పోలా రెడ్డి సాంబి రెడ్డి, యార్కరెడ్డి కోటిరెడ్డి, బొకినాల తిరుపతిరావు, పామర్తి శ్రీనివాసరావు, మాదు మహేష్, భీమవరపు సుదీప్ రెడ్డి, నుక్కెళ్ళ సురేష్, యార్కరెడ్డి వెంకట్ రెడ్డి, పాలడుగు మల్లికార్జునరావు, రామినీడు బసవపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంగాతో అంబటి కి పోలికా?, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** వంగవీటి రంగా వంటి మహా నాయకుడితో అంబటి రాంబాబు ను పోల్చడం సిగ్గుచేటని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మండి పడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేదల కోసం ప్రాణాలు అర్పించిన వంగవీటి రంగా స్థాయికి అంబటిని తీసుకురావడం వైసీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. మహిళల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని రంగా వంటి నేతతో పోల్చడం అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు. వంగవీటి రంగా పేరు పలకడానికి కూడా అర్హత లేని వ్యక్తిని ఆయనతో సరిపోల్చడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. కాపుల పై దాడులు అంటూ కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ కావాలనే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వంగవీటి రంగా పేరును ముద్రగడ, అంబటి వంటి నీచ నాయకుల రాజకీయ ప్రయోజనాల కోసం వాడటం సరికాదని స్పష్టం చేశారు. హింస, దాడులు వైసీపీ పాలనకు గుర్తులుగా మారాయని విమర్శించారు. తిరుపతి లడ్డూ విషయంలో నిజాలు వెలుగు లోకి రావడంతో వాటిని ఎదుర్కోలేక కులాల ప్రస్తావన తెరపైకి తెస్తున్నారని అన్నారు. గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు భయం, అసహనంతో చేసిన ఆరోపణలేనని పేర్కొంటూ, వైసీపీ తన రాజకీయ పంథాను మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# కాపులను వంచించినది వైసీపీ పార్టీ.

- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు.




**అచ్చుతాపురం, పెన్ సత్తా, పిబ్రవరి 03:** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు మంగళవారం పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శివ అప్పారావు మాట్లాడుతూ కాపు కులంని అడ్డుపెట్టుకొని వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అలజడలు సృష్టించాలని చూస్తున్నాడని, దీనిని ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంబటి ఒక మాజీ మంత్రి హోదాలో ఉండి రాష్ట్ర ముఖ్యమంత్రిని దుర్భసలాడడం మంచిది కాదని, ఏ నాయకుడు తప్పుచేసిన తప్పు అని ఖండించాల్సిన అవసరం నేటితరం నాయకులలో ఉందని, అంతేగాని తప్పు చేసి దాన్ని రాజకీయంగా కులముకు, మతంకో ముడి పెట్టాలని చూస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించకూడదని అన్నారు. 2019 లో కాపుల సహకారంతో అధికారం లోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి కాపు జాతిని మొత్తం ముంచేసాడని, ఇద్దరు ముగ్గురు నాయకులను చేతిలో పెట్టుకొని వారిని కీలుబొమ్మల ఉపయోగించుకుంటూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసారు. చంద్రబాబు నాయుడు హయాంలో కాపులకు ఇచ్చిన ఐదు శాతం రిజర్వేషన్లను తుంగలోకి తొక్కి, కాపు జాతిని అణిచివేశాడని, ఇప్పుడు రాష్ట్రంలో అశాంతిని, అల్లర్లను ప్రేరేపించడానికి ఈ కులం అంశాన్ని తెరమీదకు తీసుకొస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలని, చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కాపులకు సమచిత మైన ప్రాధాన్యం ఇస్తుందని, కులాలకు, మతాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కాపులు మద్దతు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వానికే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, తెలుగు యువత నాయకులు కట్టుమూరి చిత్తేశ్వరరావు పాల్గొన్నారు.

# గాజువాక నియోజకవర్గ అభివృద్ధి పై క్షేత్రస్థాయి పర్యటన..





వీఎంఆర్‌డీఏ కమిషనర్‌తో ప్రాంతాలను పరిశీలించిన పల్లా శ్రీనివాసరావు.

**గాజువాక, పెన్ సత్తా, ఫిబ్రవరి 03**: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌తో కలిసి గాజువాక నియోజకవర్గంలో మమగళవారం పర్యటించారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గాజువాక అభివృద్ధికి సంబంధించి ప్రతి పనిలో స్పష్టత, పారదర్శకత, కాలపరిమితి తప్పనిసరిగా ఉండాలని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి ఫలితాలు కనిపించాలంటే ప్రణాళికలతో పాటు కార్యాచరణ కూడా సమాంతరంగా సాగాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో పార్కింగ్, పిల్లల ఆటస్థలాల అభివృద్ధి విషయంలో తాత్కాలిక ఏర్పాట్లకు కాకుండా దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. పిల్లల ఆటస్థలాల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, తక్కువ నాణ్యత గల భద్రతా నెట్‌లు లేదా సామగ్రి ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఆలయాల ముందు టైల్స్ ఏర్పాటు చేసే పనుల్లో కూడా ప్రజా ఉపయోగ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటివరకు కాలపరిమితి, బడ్జెట్ అంశాల్లో స్పష్టత లేకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

వుడా కాలనీ అసోసియేషన్ కేసు నేపథ్యంలో కళాక్షేత్రం లీజ్ అంశాన్ని సమీక్షిస్తూ, అడ్డదిడ్డంగా లీజులు ఇచ్చే విధానాన్ని పూర్తిగా మానుకోవాలని పల్లా శ్రీనివాసరావు గారు తెలిపారు. చట్టపరమైన పరిశీలన అనంతరం ఓపెన్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించడమే పారదర్శక మార్గమని అభిప్రాయపడ్డారు. లీగల్ ఓపీనియన్, ఆక్షన్ టైమ్‌లైన్‌ను త్వరగా ఖరారు చేయాలని అధికారులను కోరారు. ఆదర్శ్ స్కూల్, స్టేడియం మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధుల పై జరిగిన చర్చల్లో కేవలం ప్రతిపాదనలకే పరిమితం కావడం పట్ల పల్లా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంత నిధులు అవసరం, ఏ శాఖ లేదా వనరుల ద్వారా సమకూరుస్తారు అనే అంశాల పై ముందుగానే స్పష్టత ఉండాలని తెలిపారు. స్పష్టమైన కార్యాచరణ లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల అభివృద్ధి, రోడ్ల నిర్మాణాన్ని ప్రాధాన్యంగా చేపట్టాలని పల్లా శ్రీనివాసరావు సూచించారు. రోడ్లు ఏ విధంగా ఉండాలి, డ్రైనేజీ, లైటింగ్ వంటి అంశాలు ఎలా అమలు చేయాలి అనే విషయాల్లో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అమలు చేసే ఏజెన్సీని కూడా స్పష్టంగా నిర్ణయించాలని అధికారులను కోరారు. 1--టౌన్ నుంచి యారాడ బీచ్ వరకు రోడ్డు అభివృద్ధి, అనుసంధాన బ్రిడ్జి ప్రతిపాదన, గాజువాక పర్యాటకాభివృద్ధికి ఎంతో కీలకమని పల్లా శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. అయితే ఇది భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్ట్ కావడంతో సాధ్యతా అధ్యయనం, అలైన్‌మెంట్, డీపీఆర్ పూర్తయిన తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతిపాదనలకే పరిమితం కాకుండా కార్యాచరణతో ముందుకు రావాలని అధికారులను కోరారు. వీఎంఆర్‌డీఏ మీటింగ్ మినిట్స్‌లో ఒక అంశం పూర్తిగా నమోదు కాకపోవడాన్ని గమనించిన పల్లా శ్రీనివాసరావు, అధికారిక రికార్డుల్లో ఇలాంటి లోపాలు ఉండటం పరిపాలనా సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. వెంటనే స్పష్టత తీసుకురావాలని లేదా అజెండా అంశాలను సరిచేయాలని సూచించారు. మొత్తంగా అభివృద్ధి పనుల్లో ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రతి అంశానికి స్పష్టమైన నిర్ణయం, బాధ్యత వహించే అధికారి, కాలపరిమితి, బడ్జెట్ హెడ్ ఉండాలని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గాజువాక ప్రజలకు అభివృద్ధి ఫలితాలు ప్రత్యక్షంగా కనిపించాల్సిందేనని, అందుకు అధికారుల సమన్వయంతో వేగంగా పనులు పూర్తి చేయాలని తెలిపారు.

# నిరుపేదలకు యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రోజెక్ట్స్ సంస్థ చేయూత.

- ఇర్ఫాన్, జాతీయ ప్రాజెక్ట్స్ ఇన్చార్జ్, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రోజెక్ట్స్ సంస్థ.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** నిరుపేదలకు యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రోజెక్ట్స్ సంస్థ చేయూత అందిస్తుంది అని యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రోజెక్ట్స్ సంస్థ జాతీయ ప్రాజెక్ట్స్ ఇన్చార్జ్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. మంగళవారం వివిఎస్ కృష్ణా కాలేజీ మైదానంలో ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో ఇబ్బందులు పడిన వారిని తమ సంస్థ గుర్తించింది వారికి పలు దఫాలుగా చేయూత అందిస్తుంది అన్నారు. ప్రస్తుతం పలు వస్తువులు, దుప్పట్లు అంద జేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అనకాపల్లి జిల్లా హెచ్ ఆర్ డి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి, మత్స్యకారులు ప్రతినిధి తెడ్డు జ్యోతి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.





# మీ ప్రయాణం సురక్షితం - మీ ప్రాణం అమూల్యం ఎస్పీ



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, వాహనదారులు విధిగా భద్రతా నియమాలు పాటించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనకాపల్లి జిల్లాలో 2025 సంవత్సరంలో 220 మంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణించారు.

హెల్మెట్ ధారణ ప్రాణ రక్షణ కవచం. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో సుమారు 50% మంది ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారని, తలకు బలమైన గాయాలు కావడమే ఇందుకు ప్రధాన కారణమని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

గణాంకాల ప్రకారం, హెల్మెట్ లేకపోవడం వల్ల ఏటా సగటున 2,500 – 3,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. హెల్మెట్ ధరిస్తే ఈ మరణాలను 80% వరకు నివారించవచ్చు అన్నారు. చట్టపర మైన నిబంధనలు – మీ భద్రత కోసమే.

పోలీసు తనిఖీలు, జరిమానాలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదని, ప్రతి వాహనదారుడు క్షేమంగా ఇంటికి చేరాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు కింది పత్రాలను కలిగి ఉండాలి:

డ్రైవింగ్ లైసెన్స్, నైపుణ్యం లేని డ్రైవింగ్ ప్రమాదాలకు దారితీస్తుంది. ఇన్సూరెన్స్ పాలసీ ప్రమాద సమయంలో ఆర్థిక భరోసా కోసం ఇది అత్యవసరం. ప్రమాదాలకు ప్రధాన 9 కారణాలు ఉంటాయి అని, ఈ క్రింది తప్పులు చేయకుండా ఉండాలని ఆయన కోరారు. ఓవర్ స్పీడింగ్ మరియు అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం. మద్యం సేవించి వాహనం నడపడం. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడటం. ట్రిపుల్ రైడింగ్. అలసటతో లేదా నిద్రమత్తులో సుదీర్ఘ ప్రయాణాలు చేయడం. బైక్ మీద బయలుదేరిన మనిషి తిరిగి క్షేమంగా ఇంటికి వచ్చే వరకు కుటుంబ సభ్యులు ఆందోళనతో ఎదురు చూస్తుంటారు. మీ నిర్లక్ష్యం మీ కుటుంబానికి తీరని లోటును మిగిల్చకూడదు. రోడ్డు నియమాలు పాటించండి – ప్రాణాలు కాపాడుకోండి అని ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు.

# లడ్డు పై అసత్య ప్రచారాలపై వైసిపి పిర్యాదు



**యలమంచిలి, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** దేశంలో ప్రసిద్ధిగాంచిన తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నేతలు చేసిన ప్రచారం పూర్తిగా అసత్యమని కోర్టుకు సమర్పించిన ఎస్ఐటీ చార్జ్‌షీట్‌లో స్పష్టంగా నిర్ధారణ అయ్యింది అని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. కోర్టులో నిజాలు వెల్లడైనప్పటికీ, ఎస్ఐటీ చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా, పట్టణ కేంద్రాలలో నెయ్యి కల్తీ అంశాన్ని వక్రీకరిస్తూ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి, వై.వి. సుబ్బా రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి ఫోటోలతో తప్పుడు, అపవాదులు కలిగించే పోస్టర్లు ఏర్పాటు చేసి, వాటిని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల పై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని కోరుతూ యలమంచిలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్టులో నిజాలు తేలిన తర్వాత కూడా కావాలని అసత్య ప్రచారాలు చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా, శాంతి భద్రతలకు ముప్పుగా మారుతుందన్నారు. ఇటువంటి చర్యల పై కఠిన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ & వైఎస్సార్ సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బోదెపు గోవింద్, యలమంచిలి మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్య దొర, మండల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు,
కౌన్సిలర్ గొర్లె వెంకట్, పిల్ల త్రినాథ్, రాపేటి సంతోష్, దుధి నరసింహమూర్తి తదితర మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణి చేసిన టీడీపీ ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య..



**కడప, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 16 మందికి 18 లక్షల 20 వేల 560 రూపాయల ఆర్థికసాయం మంజూరు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని, కార్పొరేటర్ వైద్యం చేయించుకోలేని ఎందరికో సీఎం రిలీఫ్ ఫండ్ ఊరట అని. ఆరోగ్య సేవలకు వీటిని వినియోగించుకొని ఆరోగ్యవంతులు కావాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్య సూచన చేసారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారి తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదములు తెలియజేసిన ఎమ్మెల్సీ రామచంద్రయ్య.

# ప్రాథమిక దశలోనే విద్యార్థుల జ్ఞానాన్ని అంచనా వేయాలి

డివైఈవో పి అప్పారావు



**నక్కపల్లి, పెన్ సత్తా ఫిబ్రవరి03:** పాఠశాలల్లో ప్రాథమిక దశ నుండే విద్యార్థుల జ్ఞానాన్ని ఉపాధ్యాయులు అంచనా వేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలో పలు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా దేవవరం ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న జి.ఎఫ్.ఎల్.ఎన్. ను పరిశీలించారు. 75 రోజులు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న ఈ కార్యక్రమంలో ప్రతీ విద్యార్థికి చదవడం, వ్రాయడంతో పాటు గణితంలో బేసిక్స్ ఖచ్చితంగా వచ్చితీరాలన్నారు. అనంతరం దేవవరం ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు అమలవుతున్న వందరోజుల ప్రణాళికను ఆయన పరిశీలించారు .విద్యార్థుల నోట్ పుస్తకాలు అసెస్మెంట్ పుస్తకాలు పరిశీలించారు. ఉదయం సాయంత్రం సెలవు రోజులలో నిర్వహించే అదనపు తరగతులకు ప్రతి విద్యార్థి హాజరయ్యేలా చూడాలని, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు, లచ్చబాబు ప్రభావతి లతోపాటు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వై వెంకట్రావు, డి ఆర్ కె శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేసే వరకు ఊరు ఖాళీ చేసేది లేదు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** భూ సేకరణలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఇల్లు ఖాళీ చేసే లేదని నక్కపల్లి మండలం మూలపర గ్రామస్తులు అన్నారు. ఏపీఐఐసీ అధికారులు మంగళవారం బలవంతంగా ఊరును ఖాళీ చెయ్యాలని ప్రోక్లైన్ తీసుకొచ్చి ప్రయత్నిస్తున్న చర్యలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, భూ సేకరణలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇల్లు తొలగింపులను వెంటనే ఆపాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, వివాహమైన ఆడపిల్లలకు ప్యాకేజీని తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పునర్నిర్మాణం కల్పించి, చట్టబద్ధంగా అన్ని సౌకర్యాలు కల్పించే వరకు సమయం ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఆందోళనకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆర్. శంకర్రావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్ హాజరై గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. గ్రామస్తుల న్యాయమైన డిమాండ్లకు సిపిఎం పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని వారు ప్రకటించారు.

ఈ ఆందోళన కార్యక్రమంలో మహిళలు పాల్గొనారు.

# విద్యార్ధి నాయకులను కిడ్నాప్ చేసిన మోహన్ బాబును అరెస్టు చేయాలి.

పి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర.

**ధర్మవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** సినీ నటుడు మోహన్ బాబు గుండాలచే విద్యార్థి నాయకుల పై దౌర్జన్యం చేసి కిడ్నాప్ చేయడం దుర్మార్గ చర్య అని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర పేర్కొన్నారు. ధర్మవరం పట్టణం లోని వారి కార్యాలయం నుంచి పత్రిక ప్రకటన ద్వారా కోరారు అనంతరం మంజుల నరేంద్ర మాట్లాడుతూ సినీ నటుడు మోహన్ బాబు నిర్వహిస్తున్న యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాల పై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోదుల పై కలెక్టర్ కార్యాలయం వద్ద సినీ నటుడు మోహన్ బాబు అనుచరులుగా ఉన్న 30 మంది వాహనాలలో వచ్చి అమానుషంగా వీరి పై దాడికి పాల్పడడమే కాకుండా తమ వెంట తెచ్చుకున్న వాహనాలలో వీరిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీలో గతంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిని వెలుగులోకి తీసుకొస్తున్న విద్యార్థి నేతల పై దాడులకు పాల్పడడం ఏ రకమైన సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. విద్యార్థి నాయకులకు అపాయం తలపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తప్పులు సరిదిద్దుకోమంటే దాడికి పాల్పడతారా అని ప్రశ్నించారు. పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, లేని పక్షంలో మోహన్ బాబుకు తగిన గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. తిరుపతి మోహన్ బాబు యూనివర్సిటీ లో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని వెలికి తీయాలని,విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.



# కాలుష్యం నుండి లంకెలపాలెం ప్రాంతాన్ని కాపాడండి

**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** బొగ్గు, ధూలి కాలుష్యం నుండి లంకెలపాలెం ప్రాంతాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం లంకెలపాలెం లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈ విక్రమ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కి గ్రామస్తులు హిందూజా బొగ్గు లారీలు, ఎన్టిపిసి ధూళి లారీలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, బొగ్గు ధూలు లారీల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాలుష్య సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు మానిటరింగ్ టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకెలపాలెం గ్రామ నాయకులు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, గంగరాజు, రమేష్, గోవిందా, మూర్తి, సిఐటియు నాయకులు గని శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# కైట్స్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన వినోద్ బాబు



**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** కైట్స్ జూనియర్ కళాశాల ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం. వినోద్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలు పగడ్బందీగా జరుగుతున్నాయని తెలిపారు. ఉదయం ఇంటర్ ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ సత్యన్నారాయణ, కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి ఆయన వెంట ఉన్నారు.

# వైసిపి మంత్రుల ఇళ్ళు పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**నక్కపల్లి పోలీస్ స్టేషన్ లో వైసిపి నేతల ఫిర్యాదు**




**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం ఘటనలో మాజీ మంత్రులు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నక్కపల్లి పోలీస్ స్టేషన్ లో వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త వైసిపి మాజీ శాసనసభ్యులు కంబాల జోగులు, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో సిఐ మురళి, ఎస్సై సన్నీ బాబులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందన్నారు. కూటమి చేస్తున్న తప్పులను, అసత్య ప్రచారాలను ప్రశ్నించిన వారిపై అధికార మదంతో దాడులు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరూ భయాందోళనలతో ఉన్నారన్నారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో ఎటువంటి కల్తీ జరగలేదని కోర్టు స్పష్టం చేయడంతో కూటమి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వైసీపీ నేతలపై భౌతిక దాడులకు దిగి బెదిరించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా పాలన గాలికి వదిలేసి గుండాలలా వ్యవహరిస్తున్నారని జోగులు అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి మండల అధ్యక్షులు సీరం నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు నాయకులు కొడకట్ల పాపారావు, అయినంపూడి మణి రాజు, సూరకాసుల గోవిందు, కొప్పిశెట్టి హరిబాబు, తల్లా భార్గవ్,గొర్ల గోవిందు పలువురి వైసిపి కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

# ప్రజల ముంగిటకే రెవిన్యూ సేవలు కలెక్టరు విజయ కృష్ణన్





**పట్టాదారు పాసుపుస్తకాలు నేరుగా రైతులకే పంపిణీ.**

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 03:** రెవిన్యూ సేవలను ప్రజలముంగిటకే అందిస్తున్నామని, పట్టాదారు పాసుపుస్తకాలు నేరుగా రైతులకు గ్రామంలోనే పంపిణీ చేయటం జరుగుతుందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం నక్కపల్లి మండలం కాగిత గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలను జిల్లా కలెక్టరు రైతులకు నేరుగా రైతుల ఇళ్లకే తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గతంలో జిల్లాలో రీ సర్వే జరిగిన 373 గ్రామాలలో రైతులకి జారీ చేసిన 2,01,841 పట్టాదార్ పాస్ పుస్తకాల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వశీ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాసుపుస్తకములు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రీసర్వే లో రికార్డుల తప్పులను సరిచేసి శుద్ధమైన రికార్డులతో, రైతులకు వారి భూముల పై వివాదం లేని పూర్తి హక్కులు, భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు రూపొందించి పంపిణీ చేస్తుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు కొరకు ప్రజలు ఎటువంటి రుసుములు చెల్లించనవసరం లేదని, తెలిపారు. రెవిన్యూ సేవలన్నింటిని గ్రామస్థాయిలోనే అందించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఆర్డిఓ వివి రమణ ఇతర శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పునరావాస కాలనీలో నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాల పురోగతి పై సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఇంచార్జి తహసీల్దార్ మహేష్, ఉప తహసీల్దార్ నారాయణరావు, సర్పంచ్ రాజేష్, రైతులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గోవా బీచ్ స్థాయిలో సూర్యలంక బీచ్ అభివృద్ధి





- వచ్చే ఐదేళ్లలో అతిపెద్ద పర్యాటక ప్రాంతంగా బాపట్ల
- సూర్యలంక, పాండురంగాపురం బీచ్ లలో సింగపూర్ అధికారుల బృందం పర్యటన

**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 3 :**గోవా బీచ్ స్థాయిలో బాపట్ల సూర్యలంక బీచ్ ను అభివృద్ధి చేస్తామని, వచ్చే ఐదేళ్లలో అతిపెద్ద పర్యాటక ప్రాంతంగా బాపట్ల మారిపోతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోని సూర్యలంక మరియు పాండురంగాపురం బీచ్ లను సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ కలిసి మంగళవారం పర్యటించారు. సూర్యలంక బీచ్ లో జరుగుతున్న స్వదేశీ దర్శన్ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను పరిశీలించారు. సూర్యలంక బీచ్ గుంతలు లేకుండా సజావుగా సురక్షితమైన ప్రాంతమని చెప్పారు. సున్నితమైన సన్న ఇసుక, పరిశుభ్రంగా ఉండే బీచ్ సూర్యలంక కావడం దీని ప్రత్యేకత అని వివరించారు. రైలు, బస్సులు సౌకర్యం జిల్లా కేంద్రానికి ఉండగా, అక్కడి నుంచి కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సూర్యలంక బీచ్ ఉండడం పర్యాటకులకు అనువైన ప్రాంతంగా చెప్పారు. భారత వైమానిక దళం సూర్యలంక బీచ్ కు సమీపంలో ఉండడం సురక్షిత ప్రాంతమని అన్నారు. ఇక్కడ ఒంటెలు, గుర్రాలపై స్వారీ చేయడం సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయని అన్నారు. ప్రతిరోజు సాధారణంగా సూర్యలంక బీచ్ కు మూడు నుంచి నాలుగు వేల మంది పర్యాటకులు వస్తుంటారని చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వదేశీ దర్శన్ కింద సూర్యలంక బీచ్ ను అభివృద్ధి చేస్తున్నాయాన్నారు. ఎంతో కాలంగా ఎండు చేపలు,ఎండు రొయ్యలు,సముద్ర జలాల నుంచి లభించే తాజా ఆహార పదార్థాలు ఇక్కడ లభిస్తాయన్నారు. పర్యాటకులను కనువిందు చేసే అనువైన ప్రాంతం ఈ బీచ్ కావడంతో సెప్టెంబర్ లోగా అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. తీరంలో పార్కు, అంతర్గత రహదారుల నిర్మాణం, దుకాణాలు,పర్యాటకులను అలరించే వివిధ నిర్మాణాల గురించి ఆయన తెలిపారు. బయో ట్యాగ్ టెక్నాలజీతో చేపట్టిన రొయ్యల సాగు యూనిట్ ను కలెక్టర్, సింగపూర్ అధికారుల బృందం పరిశీలించింది. ఈ పర్యటనలో సింగపూర్ ఎకానమిక్ కన్సల్టెంట్ ప్రైస్ సీఈఓ చూతోక హిమ్,సింగపూర్ కోపరేషన్ ఎంటర్ ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ త్యాలైన్ చీవో, సింగపూర్ సస్టైనబిలిటీ స్ట్రాటజిక్ ప్రాజెక్టు సీనియర్ మేనేజర్ నిషశర్ద, రాష్ట్ర ఆర్థిక శాఖ డైరెక్టర్ బీ గోపాల్,బాపట్ల ఆర్డీఓ పీ గ్లోరియా, మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్ నాయక్,మత్స్యశాఖ డీడీ గాలి దేముడు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

**బాపట్ల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ**

**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 3 :**ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు వ్యాధి నిర్ధారణ చేయడంలో ల్యాబ్ టేక్నిషియన్లది అత్యంత కీలకమైన పాత్ర అని బాపట్ల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ అన్నారు. మంగళవారం బాపట్ల పట్టణంలోని ఎన్జీఓ హోంలో జరిగిన బాపట్ల జిల్లా ల్యాబ్ టేక్నిషియన్లు మరియు సబ్ యూనిట్ అధికారుల నెలవారి మలేరియా సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టేక్నిషియన్లు కచ్చితంగా సమయపాలన పాటిస్తూ రోగులకు ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా వ్యాధి నిర్ధారణ చేసినప్పుడే రోగులకు సరైన న్యాయం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ల్యాబ్ లలో ఏమైనా పరికరాలు అవసరం ఉంటే జిల్లా కలెక్టర్ ప్రారంభించిన బాపట్ల సేతు యాప్ లో వైద్యాధికారి ద్వారా కావలసిన వస్తువులను ఇండెంట్ పెట్టాలని ఆదేశించారు.



## అభ్యర్థుల చేతికి 'బీ-ఫామ్'.. ప్రచారానికి 'శ్రీకారం'!

- ఏదులాపురం మున్సిపల్ పోరులో 'హస్తం' దూకుడు
- బీ-ఫామ్‌లు అందజేసి...అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన మంత్రి పొంగులేటి



**ఏదులాపురం పెన్ సత్తా, ఫిబ్రవరి 3 :** ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ కీలక ఘట్టాన్ని పూర్తి చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం అభ్యర్థుల చేతికి బీ-ఫామ్ లు అందజేశారు. దీంతో మున్సిపల్ కోటపై 'హస్తం' జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రచార పర్వం ఊపందుకుంది.

గెలుపే లక్ష్యంగా గడప గడపకూ..

బీ-ఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు నామినేషన్లు సమర్పించాలని మంత్రి సూచించారు. "అధికారికంగా బీ-ఫామ్‌లు అందాయి.. ప్రభుత్వ ప్రజారంజక పాలనను, అమలు చేస్తున్న గ్యారంటీలను వివరించి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

క్లీన్ స్వీప్ టార్గెట్!

వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఏదులాపురంలోని అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రి చేతుల మీదుగా బీ-ఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచార క్షేత్రంలోకి అడుగుపెట్టారు.

## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గణపారపు వీరయ్య



**ఏదులాపురం పెన్ సత్తా, ఫిబ్రవరి 3 :** 27వ వార్డులో నివాసం ఉంటున్న సీపీఐ సీనియర్ నాయకుడు గణపారపు వీరయ్య ఇంటికి మంగళవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా గణపారపు వీరయ్య, మధుతో పాటు మరో 20 మంది సీపీఐ నాయకులకు మంత్రి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలకు మరింత ప్రాధాన్యత చేకూరింది.

## చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ట కు భూమి పూజ

**విగ్రహ నిర్మాణ దాత ఎంపీ రఘునందన్ రావు**




**చేగుంట/ పెన్ సత్తా, ఫిబ్రవరి 3** మరాఠా వీరుడు సామ్రాజ స్థాపకుడు చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణం కోసం మంగళ వారం పొలంపల్లి లో, మెదక్ ఎంపీ రఘునందన్ రావు చొరవతో భూమి పూజ చేయడం జరిగింది, గ్రామ పెద్దలు మాట్లాడుతూ చత్రపతి శివాజీ (1630బి1680)మరాఠా సామ్రాజ్య స్థాపకుడు భారతదేశ చరిత్రలో ఒక గొప్ప యోధుడు,అతను మరాఠా సామ్రాజ్యనీ స్థాపించి,మొగల్ సామ్రాజానికి వ్యతిరేకంగా పోరాడి,భారతదేశంలో హిందూ రాజ్యని స్థాపించాడు, బాల్యం, విద్య,శివాజీ 1645 లో, తన తండ్రి నుండి స్వతంత్రుడై,తన సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు,శివాజీ తన సైనిక నైపుణ్యం వ్యూహాలతో మొగల్ సామ్రాజానికి వ్యతిరేకంగా పోరాడి,అనేక విజయాలు సాధించాడు, వారి విజయాలు 1659 : ప్రతాప్ గాడ్ యుద్ధంలో మొగల్ సేనాని అఫ్జల్ కన్ ను ఓడించాడు,1665 : పురందర్ సంది కుదుర్చుకున్నాడు,1674 : రాజ్యాభిషేకం చేసుకొని, చత్రపతి (ఇంపీరియల్ టైటిల్) అనే బిరుదును స్వీకరించాడు,శివాజీ మరణం 1680 ఏప్రిల్ 3న రాజ్ గడ్ కోటలో మరణించాడు, వారు చేసిన సేవలకు గుర్తుగా విగ్రహ నిర్మాణం చేయడం జరిగిందని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో,గ్రామ పెద్దలు, శ్రీరామ్ సభ్యులు,అంబేద్కర్ యూత్ సభ్యులు, స్నేహ యూత్ సభ్యులు, శివాజీ యూత్ సభ్యులు, హనుమాన్ యూత్ సభ్యులు, బజరంగ్ దళ్ యూత్ సభ్యులు, ఆదర్శ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు,

## మృతుడి కుటుంబానికి ఆర్ఎంఎస్ ఫౌండేషన్

**ద్వారా 25 కేజీల రైస్ బ్యాగ్ అందజేత**

**పెన్ సత్తా, ఫిబ్రవరి 3** పనకబండ గ్రామానికి చెందిన నల్లపోగుల సోమయ్య గారు ఇటివల కాలం అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడి ప్రార్ధిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ =మీా పౌండేషన్ ద్వారా రాధారపు మల్లేశం ఉప సర్పంచ్ గారు వారి కుటుంబానికి 25 ఎస్త్ర బియ్యం బ్యాగ్ అందచేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బత్తిని జయరాములు. ఫైళ్ళ సతీష్. నల్లపోగుల వెంకన్న. బత్తిని సతీష్. నల్లపోగుల ఉప్పలయ్య . బి.మల్లేష్ .మార్గం సుజాత. నిలుగొండ జయమ్మ. బత్తిని నవీన్. పోలేపేల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు

## కొత్తగూడెం కార్పోరేషన్ పై ఎర్రజెండా ఎగరాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.
- అభ్యర్థులకు బి ఫారాలు అందజేత .



**పెన్ సత్తా, ఫిబ్రవరి 3** కొత్తగూడెం కార్పోరేషన్పై ఎర్రజెండా ఎగరాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేషన్ ఎన్నికలకు సంబందించి బరిలో ఉన్న అభ్యర్థులకు స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆయన మంగళవారం బి ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా సిపిఐ తన అభ్యర్థులను ప్రకటించిందని, టిడిపి, ప్రజా సంఘాల మద్దతుతో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ప్రజాక్షేత్రంలోకి వెళుతుందని చెప్పారు. సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పూర్తిగా పార్టీ కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగానే కొత్తగూడెం కార్పోరేషన్ వ్యాప్తంగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ముఖ్యమంత్రి, మంత్రులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామనే భావన వద్దని, స్థానిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల్లో భాగంగానే ఈ నిర్ణయానికి వచ్చామన్నారు. గత రెండేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు జరిగిందని, మారుమూల ప్రాంతాల్లో సైతం మౌళిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేని కృషి చేశామని, ఎన్నడూ జరగని అభివృద్ధి కొత్తగూడెం నియోజకవర్గంలో జరిగిందని, అనుక్షణం ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. కార్పోరేషన్ ఏర్పాటుతో పాల్వంచ పరిధిలో 25నం. తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంత అభివృద్ధి శరవేగం కానుందన్నారు. కార్పోరేషన్ కాకుండా ఆనే శక్తులు కుట్రలు పన్నాయని, వారి కట్రలు, కుతంత్రాలను పటాపంచలు చేస్తూ తామిచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం అనతికాలంలోనే కొత్తగూడెం కార్పోరేషను ప్రకటించిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, సిపిఐ అభ్యర్థులు గెలవడం ద్వారా కొత్తగూడెం కార్పోరేషన్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు దూసుపోనుందని, కార్పోరేషన్ పై ఎర్రజెండా ఎగిరేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## లేబర్ కోడ్‌లపై మండిపడ్డ ఆశా వర్కర్ల యూనియన్

- ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల పిలుపు

**పెన్ సత్తా, ఫిబ్రవరి 3** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏన్కూర్ మండల ఆశా వర్కర్ల యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు మండల కమిటీ ప్రతినిధులు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారికి సమ్మె నోటీసును అందజేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు సంవత్సరాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను తగ్గించేలా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతన హామీలు, సంక్షేమ ప్రయోజనాలు తగ్గే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని, కార్మికులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలను విస్మరించిందని ఆరోపించారు. దేశంలోని కార్మిక వర్గం మొత్తం ఐక్యంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రజిత, రజిని, లక్ష్మీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# భారత్-అమెరికా ట్రేడ్ డీల్





### ట్రంప్ చెప్పినవాటిలో నిజమయ్యేవి ఎన్ని. కొన్ని అంశాల పై ఇండియా ఎందుకు మౌనంగా ఉంది?.

**పెన్ సత్తా, ఫిబ్రవరి 3 :**రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేతకు భారత ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ సోమవారం తెలిపారు. దీనితో భారత్ పై సుంకాలను 25 శాతం నుంచి, 18 శాతానికి తగ్గించనుంది అమెరికా. కొన్ని నెలలుగా భారత్-అమెరికా మధ్య సాగుతున్న ఉద్రిక్తతలకు ఈ ప్రకటన తెరదించుతుందని భావిస్తున్నారు. సోమవారం నేను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తో మాట్లాడాను. వివిధ అంశాల పై చర్చించాను. వాణిజ్యం, యుక్రెయిన్ యుద్ధాన్ని ముగించడం, అమెరికాతోపాటు ముఖ్యంగా వెనెజ్వెలా నుంచి మరింత చమురు కొనడం వంటి అంశాలు ఉన్నాయి అని తన ట్రూత్ సోషల్ లో చేసిన పోస్ట్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో ఉన్న స్నేహం, గౌరవంతో ఆయన విజ్ఞప్తి మేరకు తక్షణమే అమల్లోకి వచ్చే భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి మేం అంగీకరించాం. ఈ ఒప్పందంలో భాగంగా టారిఫ్ లను 25 శాతం నుంచి, 18 శాతానికి అమెరికా తగ్గిస్తుంది అని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే యుక్రెయిన్ పై యుద్ధంలో రష్యాకు భారత్ సాయం చేస్తోందని ట్రంప్ గతంలో ఆరోపించారు. ట్రంప్, మోదీ భిన్న ప్రకటనలు.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు నిరుడు ఆగస్టులో భారత్ పై 25 శాతం టారిఫ్ లను అదనంగా విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. అంతకు ముందు భారత్ పై 25శాతం సుంకాలు విధించారు. అమెరికా పై విధించిన టారిఫ్ లను భారత్ సున్నాకు తగ్గిస్తుందని ట్రంప్ చెప్పారు. బై అమెరికన్ పాలసీ కింద ఇంధనం, సాంకేతికత, వ్యవసాయ ఉత్పత్తులు సహా 500 బిలియన్ డాలర్లకు పైగా అమెరికా వస్తువులను భారత్ కొంటుందని తెలిపారు. నా ప్రియమైన స్నేహితుడు, అధ్యక్షుడు ట్రంప్ తో మాట్లాడటం చాలా ఆనందంగా ఉంది. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తుల పై సుంకం ఇప్పుడు 18 శాతానికి తగ్గనుందని తెలిసి నాకు సంతోషంగా ఉంది. ఈ ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ధన్యవాదాలు అని ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. అయితే, ట్రంప్ ప్రకటనకు, మోదీ చెప్పిన దానికి మధ్య చాలా వైరుధ్యం ఉంది. రష్యా నుంచి చమురు కొను గోలును భారత్ నిలిపివేస్తుందని ట్రంప్ చెప్పారు. కానీ, ప్రధాని మోదీ ఆ మాటా చెప్పలేదు. అమెరికా వస్తువుల పై టారిఫ్ లను భారత్ జీరో కు తగ్గిస్తుందని ట్రంప్ అన్నారు. కానీ మోదీ దాని గురించి ప్రస్తావించ లేదు. భారత్ 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెప్పారు. కానీ దీని పై భారత్ నుంచి బహిరంగంగా ఎలాంటి ప్రకటనా రాలేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేతకు మోదీ అంగీకరించారని ట్రంప్ చెప్పారు. నాకీ విషయంలో చాలా సందేహాలు ఉన్నాయి అని దక్షిణాసియా భౌగోళిక రాజకీయాలను పరిశీలించే మైఖేల్ కుగెల్‌మన్ చెప్పారు.

అమెరికా కొత్త సంకాలు విధించడంతో రష్యా నుంచి చమురు కొనడాన్ని గతేడాది నవంబరు నుంచి భారత్ తగ్గించింది. ఈ విషయం పక్కనపెడితే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో అనేక విషయాలు అస్పష్టంగా ఉన్నాయి. వ్యవసాయం వంటి సున్నిత మైన మార్కెట్ లను భారత్ తెరిచి ఉంచుతుందా?, ఈ ఒప్పందం ముందుకు సాగకపోవడానికి గతంలో ఇదే ప్రధాన కారణం అని ఆయన అన్నారు. ట్రంప్ ఆశలు ఏంటిడ500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని కూడా ట్రంప్ చెప్పారు. దీని పై కూడా సందేహాలు ఉన్నాయి. 2024 లో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 212 బిలియన్ డాలర్లు. గతేడాది అమెరికా నుంచి భారత్ 41.5 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను మాత్రమే కొనుగోలు చేసింది, ఇది 500 బిలియన్ డాలర్లకు చేరడం అసాధ్యం అని బ్రిటీష్ వార్తాపత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ తో బ్రిడ్జ్ ఇండియా థింక్-ట్యాంక్ వ్యవస్థాపకుడు ప్రతీక్ దత్తానీ చెప్పారు.

భారత్ ఇదివరకే రష్యా నుంచి చమురు కొనడాన్ని తగ్గించిందని, రష్యాతో ఉన్న సంబంధాల దృష్ట్యా దీన్ని పూర్తిగా నిలిపివేయడం కష్టం అని ఆయన అన్నారు. 2022 లో యుక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా నుంచి ముడి చమురును తక్కువ ధరకు భారత్ పెద్ద మొత్తంలో కొనుగోలు చేసింది. సమీప భవిష్యత్తులో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను భారత్ కొనుగోలు చేసే అవకాశాలు చాలా తక్కువని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ మాజీ సలహాదారు ఇవాన్ ఏ ఫీజెన్‌బౌమ్ ఎక్స్‌లో రాశారు. భారత్ కు అమెరికా వస్తువుల ఎగుమతులు 2024 లో 41.5 బిలియన్ డాలర్లు. అమెరికా ఎగుమతులు 41.8 బిలయన్ డాలర్లు. 83 బిలియన్ డాలర్ల నుంచి 500 బిలియన్ డాలర్లకు చేరడం అంటే దాదాపు 500 శాతం పెంచడం అంచనాలకు అతీతం. నిజం చెప్పాలంటే ఇది కాస్త అతి అంచనా అని ఇవన్ రాశారు. రష్యా చమురుకు సంబంధించి ఏదైనా హామీలకు భారత్ ఆమోదం తెలుపుతుందని నేను భావించడం లేదు అని ఫైనాన్షియల్ టైమ్స్‌తో పారిస్ కు చెందిన జాక్వెస్ డెలోర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో వాణిజ్యం, ఆర్థిక భద్రతా సలహాదారు నికోలస్ కోఫ్లర్ అన్నారు. ట్రంప్ చెబుతున్నట్లుగా అన్ని రకాల టారిఫ్ లను సున్నాకు తగ్గించడానికి భారత్ అంగీకరించిందనే విషయం అసహజంగా అనిపిస్తోందని ఆయన అన్నారు. టారిఫ్ లను పూర్తిగా సున్నాకు తగ్గించడం పై భారతదేశం అంగీకరిస్తుందా అన్నది సందేహంగా ఉంది. ఎందు కంటే ఇప్పటివరకు జరిగిన దోహా వాణిజ్య చర్చల్లో భారత్ జాగ్రత్తగా వ్యవహరిస్తూ వచ్చింది. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో అది మరింత అప్రమత్తంగా ఉంటుంది అని ఆయన అన్నారు. నా అంచనా ఏంటంటే అమెరికా నుంచి కొన్ని వస్తువుల పై టారిఫ్ లను భారత్ సున్నాకు తగ్గిస్తుంది. దీనిని ట్రంప్ అమెరికా వస్తువుల పై సుంకాలను భారత్ సున్నాకు తగ్గించింది అని తనకు నచ్చినట్లుగా అర్థం చేసుకుని, ప్రచారం చేసుకుంటారు అని సదానంద్ ధూమే 'ఎక్స్'లో రాశారు. గత నెలలో యురోపియన్ యూనియన్, భారత్ వాణిజ్య ఒప్పందం పై అంగీకారానికి రావడం, అంతకు ముందు బ్రిటన్ తోనూ భారత్ ఎఫ్‌టీఏ కుదుర్చుకోవడం వంటివి భారత్ తో ఒప్పందానికి వచ్చేలా ట్రంప్ పై ఒత్తిడి పెంచినట్టు భావిస్తున్నారు.

ట్రంప్ అనేక ప్రకటనలు చేసినప్పటికీ, లిఖిత పూర్వక ఒప్పందం లేకుండా దీని పై ఓ నిర్ధరణకు రావడం కష్టం. ట్రంప్ ప్రకటనతో భారత్ పై పడే ప్రభావం ఏంటి?. ఈ తగ్గింపుతో చైనాకు ప్రత్యామ్నాయంగా ఓ ఆకర్షణీయ మైన తయారీ హబ్ గా భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని బ్లూమ్‌బర్గ్‌తో డిప్యూటీ చీఫ్ ఆఫ్ క్యాపిటల్ ఎకానమిక్స్ షాలిన్ షా చెప్పారు.

ఇది భారత జీడీపీ వృద్ధి రేటును 2026 లో 0.2 నుంచి 0.3 శాతానికి పెంచుతుంది. ఇది 2026, 2027 సంవత్సరాలకు క్యాపిటల్ ఎకానమిక్స్ అంచనా వేసిన 7 శాతం వృద్ధికి దగ్గరగా ఉంటుంది అని షా అన్నారు. ఇది భౌగోళిక రాజకీయాల పై ప్రభావం చూపెడుతుందని షా అన్నారు. భారత్ లోని చాలా మంది వ్యూహాత్మకంగా అలీనంగా(నాన్-అలైన్డ్) ఉండటానికి ఇష్టపడతారు, కానీ ప్రస్తుతానికి అలా కాదు. అమెరికా కూటమి వైపు భారత్ మొగ్గు చూపే అవకాశం ఉంది అని ఆయన అన్నారు. భారత్ కు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్. ఈ కొత్త టారిఫ్‌లు శ్రామిక శక్తి అధికంగా ఉండే టెక్స్‌టైల్స్, తోలు, చెప్పులు, ఆభరణాల వంటి పరిశ్రమల పై ప్రభావం చూపింది. తాజా వాణిజ్య డేటా ప్రకారం అక్టోబర్‌లో వార్షిక ఎగుమతులు 12 శాతానికి పడిపోయి, వాణిజ్య లోటు రికార్డు స్థాయి గరిష్ఠానికి చేరాయి.

ఈ తాజా ప్రకటనతో భారత్ అప్పుడే సెలబ్రేట్ చేసుకోవద్దని దిల్లీ కి చెందిన థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్‌కు చెందిన అజయ్ శ్రీవాస్తవ అన్నారు. ట్రంప్ ట్రూత్ సోషల్ పోస్ట్, అనేక ప్రశ్నలకు సమాధానాలు లేకుండానే ఉంది. అందులో ఏ వస్తువులు ఉంటాయి, ఇది ఎంతకాలం ఉంటుంది, భారత్ నిజంగా జీరో టారిఫ్ లకు అంగీకరించిందా, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల విషయంలో ఏం చేసింది అని శ్రీవాస్తవ రాశారు. అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల కొనుగోళ్ల సంఖ్య అస్పష్టంగా ఉంది. అమెరికా నుంచి భారత్ ప్రస్తుతం 50 బిలియన్ డాలర్ల కంటే తక్కువ దిగుమతులే చేస్తోంది. ఇది నిర్దిష్టమైన హామీ కంటే చేరడానికి కష్టమైన లక్ష్యం. ఉమ్మడి ప్రకటన జారీ అయ్యేవరకు దీన్ని తుది అంగీకారంకంటే ఓ రాజకీయ సూచికగానే భావించాలి. ఇది అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఉత్సవాలకు కాదు అని ఆయన అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును ఆపేస్తారు. అమెరికా నుంచి భారత్ కి దిగుమతుల పై టారిఫ్‌లు లేవు. భారత ఎగుమతుల పై 18 శాతం టారిఫ్‌లు ఉంటాయి. 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు వంటివి భారత్ కు అమెరికా ఎగుమతి చేస్తుంది. అసలేం జరుగుతోంది, భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ఏమైపోయింది అని కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ ఎక్స్‌లో ట్రంప్ ట్రూత్ సోషల్ పోస్ట్‌ను షేర్ చేస్తూ రాశారు.

# సెన్సెక్స్ 2000 పాయింట్లు జంప్

### ట్రంప్ తెచ్చిన శుభవార్తతో మార్కెట్ లో 12.5 లక్షల కోట్లు లాభం..

**బిజినెస్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 3** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన శుభవార్తతో దేశీయ స్టాక్ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకెళ్లాయి. సెన్సెక్స్ 2000 పాయింట్లకు పైగా లాభపడింది. దీంతో ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే రూ. 12.5 లక్షల కోట్లు పెరిగింది. కీలక రంగాల షేర్లు రాణించాయి. అదానీ ఎంటర్ ప్రైజెస్ షేరు 9 శాతానికి పైగా లాభంతో ముగిసింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 3 వ తేదీన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ గురించి తెలుసుకుందాం. దేశీయ స్టాక్ మార్కెట్లో చాలా రోజుల తర్వాత కొత్త ఉత్సాహం కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన శుభవార్తతో ఫిబ్రవరి 3 వ తేదీన సూచీలు రాకెట్ వేగంతో పరుగులు పెట్టాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అమెరికాతో ట్రేడ్ డీల్ పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసంది. మంగళవారం ఉదయం మార్కెట్ ప్రారంభ మైనప్పటి నుంచి ముగిసే వరకు బుల్ రన్ కొనసాగింది. దీంతో సెన్సెక్స్ 2000 పాయింట్లకు పైగా లాభపడింది. నిఫ్టీ 50 ఇండెక్స్ 25,700 మార్క్ పైన ముగిసింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. ఇక ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఒక్కరోజే రూ.12.5 లక్షల కోట్లు పెరిగింది. ప్రస్తుతం కంపెనీల విలువ రూ.455 లక్షల కోట్ల నుంచి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది. భారత్ తో ట్రేడ్ డీల్ అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం అర్ధరాత్రి ప్రకటన చేశారు. భారత్ నుంచి వచ్చే వస్తువుల పై విధించిన 50 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతుల పై విధిస్తున్న టారిఫ్స్ జీరో స్థాయికి చేర్చేందుకు, రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు ఆపేందుకు భారత్ అంగీకరించినట్లు తెలిపారు. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో ఇప్పటి వరకు భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల పై 50 శాతం సుంకాలు ఉండగా అది 18 శాతానికి దిగివస్తుంది. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది. ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఈరోజు సెన్సెక్స్ సూచీ ఆరంభం లోనే 3600 పాయింట్లు లాభంతో 85,323 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 4000 పాయింట్లు లాభపడి 85,871 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2073 పాయింట్ల లాభంతో 83,739 వద్ద ముగిసింది. ఇక జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 50 ఇండెక్స్ ఇంట్రాడేలో 26,341 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 639 పాయింట్లు లాభపడి 25,727 వద్ద ముగిసింది. మరో వైపు భారత దేశ కరెన్సీ రూపాయి సైతం కోలుకుంది. డాలరుతో పోలిస్తే గ్లోబల్ మార్కెట్లో రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా ట్రేడ్ డీల్ తర్వాత ఒక్కరోజులోనే 1.36 బలపడింది.




దీంతో ఈరోజు రూపాయి విలువ 90.26కు చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో పలపడడం ఇదే తొలిసారి. సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 9.12 శాతం పెరగగా బజాజ్ ఫైనాన్స్ 6.68 శాతం, ఇండిగో 5.51 శాతం, సన్ ఫార్మా 4.54 శాతం మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక బంగారం ధర మళ్లీ పెరిగింది. ఔన్స్ ధర 4921 డాలర్ల వద్ద ఉంది.


# మెంతి కూర పవర్ తెలిస్తే వదలరు



ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మెంతి ఆకు.. అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు, మధుమేహం నియంత్రణ, చర్మ వ్యాధుల నివారణకు తోడ్పడుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ ఆకు, జ్ఞాపకశక్తిని పెంచి, క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధించగలదు. మెంతి కూరలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మన భారతీయ వంటకాల్లో సర్వసాధారణంగా ఉపయోగించే ఒక అద్భుతమైన ఆకుకూర. ఇది కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని మెంతి లేదా మెంతి కూర అని కూడా పిలుస్తారు. రుచికి చేదుగా ఉన్నప్పటికీ, ఈ ఆకు అనేక పోషక విలువలను, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. సాధారణంగా మెంతి ఆకులో చిన్న మెంతెం, పెద్ద మెంతెం అని రెండు రకాలుంటాయి. ఈ ఆకు శరీరానికి సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుంది. మెంతి ఆకులో కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్‌లతో పాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఈ పోషకాలు శరీరానికి బలాన్ని చేకూర్చి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. లివర్ ఆరోగ్యం, డయాబెటిస్ నియంత్రణ: మెంతి ఆకు ముఖ్యంగా కాలేయ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ, ఇతర సమస్యలు: మెంతి ఆకు ఆకలిని పెంచుతుంది. దగ్గు, మొలలు, వాంతులు, కీళ్ల వ్యాధులు వంటి అనేక సాధారణ వ్యాధులను నివారిస్తుంది. కడుపులోని నులిపురుగులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. అయితే, పప్పు దినుసులలో దీనిని అతిగా వేయకూడదు.. లేదంటే పప్పు చేదుగా మారుతుంది. రక్తహీనత నివారణ: ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను దూరం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుదల: మెంతికూరలో అధికంగా ఉండే ఫైబర్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. దృష్టి లోపాలు ఉన్నవారు ఈ ఆకును తమ ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవడం మంచిది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండేవాళ్లు మెంతికూరను తీసుకోవచ్చు. ఇది శరీరానికి చలువనిస్తుంది.. వేడి వలన వచ్చే అలర్జీలను దూరం చేస్తుంది. కఫం, పిత్త, వాతం వంటి రోగాలను దరిచేరనివ్వకుండా చేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుదల, క్యాన్సర్ నిరోధం: మెంతి ఆకు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సఫోన్ మ్యూకలేట్ ధాతువులు క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడతాయి. హృదయ ఆరోగ్యం, ఇతర ప్రయోజనాలు: విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వల్ల గుండెపోటు, అలర్జీలు, దృష్టి లోపాలు, రక్తహీనత వంటి వాటిని తొలగిస్తుంది. నరాల బలహీనతతో బాధపడేవారు కూడా మెంతి కూరను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇంకా.. మెంతి ఆకులను పేస్ట్‌లా చేసి ఫేషియల్‌గా ఉపయోగించవచ్చు. ఇది నల్లగా ఉన్నవారికి చర్మకాంతిని పెంచి, ముఖంపై నల్ల మచ్చలు, ముడతలను తగ్గిస్తుంది. మెంతులను నానబెట్టి పేస్ట్‌లా చేసి జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి ఆకుతో లేదా మెంతులతో చేసే పప్పు ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం. మెంతి ఆకును ఎండబెట్టి పొడి చేసుకొని, అవసరమైనప్పుడు పప్పులు, కూరలలో వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. మన ఇంటి పెరడులో కూడా మెంతి ఆకును సులువుగా పెంచుకోవచ్చు.. వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు మెంతులు లేదా మెంతి ఆకును ఆహారంలో చేర్చుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇది కేవలం ఒక ఆకుకూర మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఒక దివ్య ఔషధం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.


# నిమ్మకాయ నీటిలో ఈ ఒక్క పదార్థం కలిపి తాగండి చాలు!

మలబద్ధకం ఈ రోజుల్లో చాలామందిని ఇబ్బంది పెడుతున్న సాధారణ సమస్య. అనియమిత ఆహారపు అలవాట్లు, తక్కువ ఫైబర్ తీసుకోవడం, నీరు సరిపడా తాగకపోవడం, ఒత్తిడి వంటి కారణాల వల్ల ఈ సమస్య వస్తోంది. అయితే సహజంగా, ఇంట్లోనే సులభంగా మలబద్ధకాన్ని తగ్గించుకునే ఒక మార్గం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మనం తిన్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమై విసర్జించబడాలి. లేదంటే అనేక వ్యాధుల బారినపడాల్సి వస్తుంది. మారుతున్న జీవనశైలిలో భాగంగా ఎవరూ కూడా సమయానికి భోజనం చేయడం లేదు. దీంతో తిన్నది జీర్ణం కావడం లేదు. ఈ క్రమంలో చాలా మంది మలబద్ధకం సమస్యను ఎదుర్కొంటున్నారు. మలబద్ధకం అనేది మన దైనందన జీవితాన్ని చాలా ఇబ్బంది పెట్టడమే గాక.. అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. అయితే, ఈ విషయాన్ని చాలా మంది బయటకు చెప్పుకోలేక బాధపడే వాళ్లూ ఉన్నారు. అయితే సహజంగా, ఇంట్లోనే సులభంగా మలబద్ధకాన్ని తగ్గించుకునే ఒక మార్గం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయ నీటికి ఇదొక్కటి కలపండి.. మలబద్ధకాన్ని నివారించేందుకు చాలా మంది నిమ్మకాయ నీరు తాగుతుంటారు. అయితే, ఇందులో ఒక పదార్థం చేర్చడం వల్ల మలబద్ధకం సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయ నీరు పేగులను హైడ్రేట్ చేయడంతోపాటు సిట్రిక్ యాసిడ్‌ను విడుదల చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అయితే, మీరు తాగే నిమ్మకాయ నీటిలో కేవలం ఒక స్పూన్ చియా గింజలను కలిపి 10 నిమిషాలు నానబెట్టి తీసుకోవడం వల్ల అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. చియా గింజలను నిమ్మకాయ నీటికి



జోడించడం వల్ల పేగులకు, ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. చియా గింజలతో నిమ్మకాయ నీరు కలిపి తాగితే.. చియా గింజల్లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అందుకే నానబెట్టినప్పుడు అవి గుజ్జు లాంటి పదార్థంగా మారుతాయి. ఫుడ్ సైన్ అండ్ న్యూట్రిషన్ అధ్యయనం ప్రకారం.. ఆ గుజ్జు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఉదయం మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. జీర్ణవ్యవస్థ శుభ్రపర్చడం ద్వారా మలబద్ధకాన్ని నివారిస్తుంది. చియా గింజలలో ఒమేగా3 (ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం), నిమ్మకాయ నీటితో కలిపితే ట్రైగ్లిజరైడ్స్, ఎల్డీఎల్ కొలెస్ట్రాల్, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ ఊఆఒ స్థాయిలను పెంచుతుంది. రెండు కలిపి తీసుకోవడం వల్ల లిపిడ్ స్థాయిలను మెరుగుపర్చి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీంతో గుండె జబ్బులు ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చియా గింజల్లో లభించే ఫైబర్, నిమ్మకాయ నీటితో కలిపితే కార్బోహైడ్రేట్ల శోషణను నెమ్మదిస్తుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది.

# బరువు తగ్గాలనుకుంటే ఆ పని మాత్రం అస్సలు చేయద్దు!



బరువు తగ్గడం అనేది ఒక తపస్సు లాంటిది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన చిట్కాలు పాటిస్తుంటారు. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతి 'బ్రేక్‌ఫాస్ట్ స్కిప్పింగ్'. ఉదయం పూట కడుపు ఖాళీగా ఉంచితే ఒంట్లో ఉన్న కొవ్వు కరిగిపోతుందని చాలామంది గట్టిగా నమ్ముతారు. కానీ ఇది ఎంతవరకు నిజం? అసలు ఉదయం పూట శరీరానికి అందాల్సిన ఇంధనం అందకపోతే మన అవయవాలు ఎలా స్పందిస్తాయి? పొద్దున్నే టిఫిన్ మానేయడం వల్ల మీరు నిజంగా సన్నబడతారా లేక లేనిపోని రోగాలను కొని తెచ్చుకుంటున్నారా? జపాన్ నుంచి అమెరికా వరకు జరిగిన అనేక పరిశోధనలు ఈ విషయంలో సంచలన విషయాలను వెల్లడించాయి. బరువు తగ్గడం పక్కన పెడితే.. ఈ అలవాటు వల్ల మీ మెదడు పనితీరు కూడా మందగించే ప్రమాదం ఉంది. అవును.. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. చాలా సందర్భాల్లో బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల బరువు తగ్గకపోగా.. మరింత పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. పొద్దున్నే ఏమీ తినకపోవడం వల్ల మధ్యాహ్నం సమయానికి కడుపులో ఆకలి సెగలు పుడుతుంటాయి. ఈ తీవ్రమైన ఆకలి వల్ల మధ్యాహ్నం భోజనంలో మనకు తెలియకుండానే ఎక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాన్ని, జంక్ ఫుడ్‌ను ఆరగిస్తాం. ఉదయం ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ తర్వాత మధ్యాహ్నం భారీ భోజనం చేయడం వల్ల ఇన్సులిన్ అకస్మాత్తుగా పెరుగుతుంది. ఈ హెచ్చుతగ్గులు శరీరంలో కొవ్వు నిల్వలు పెరగడానికి ప్రధాన కారణమవుతాయి. రాత్రంతా నిద్రపోయిన తర్వాత మన శరీరానికి శక్తి అవసరం. అది అందకపోతే శరీరం 'సర్వైవల్ మోడ్'లోకి వెళ్తుంది. అంటే శక్తిని ఆదా చేయడం కోసం మెటబాలిజం రేటును తగ్గించేస్తుంది. ఫలితంగా మీరు ఎంత తక్కువ తిన్నా సరే క్యాలరీలు త్వరగా ఖర్చు అవ్వవు. కేవలం 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్' (16/8 పద్ధతి) పాటించే వారు మాత్రమే బ్రేక్‌ఫాస్ట్ మానేసి బరువు తగ్గే అవకాశం ఉంది. అంటే ఉదయం టిఫిన్ మానేసి, కేవలం మధ్యాహ్నం నుంచి రాత్రి ఎనిమిది గంటల లోపు మాత్రమే భోజనం చేస్తూ, రోజంతా తీసుకునే మొత్తం క్యాలరీలను కచ్చితంగా లెక్కిస్తే ఫలితం ఉంటుంది. అయితే ఇది అందరికీ సరిపడదు. ముఖ్యంగా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు ఇలా చేయడం వల్ల తీవ్ర అనారోగ్య పాలయ్యే ప్రమాదం ఉంది. బ్రేక్‌ఫాస్ట్ అంటేనే రాత్రంతా మనం ఉన్న ఉపవాసాన్ని విరమించడం అని అర్థం. ఉదయం పూట పోషక విలువలూ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు చాలా ఉన్నాయి. ఉదయం గ్లూకోజ్ అందడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. ఆఫీసులో లేదా చదువులో చురుగ్గా ఉండవచ్చు. సరైన ప్రోటీన్ ఉండే టిఫిన్ తీసుకుంటే రోజంతా నీరసం రాకుండా ఉంటుంది. క్రమం తప్పకుండా బ్రేక్‌ఫాస్ట్ చేసేవారిలో కొలెస్ట్రాల్, రక్తపోటు అదుపులో ఉంటాయని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

## ఈ సమయంలో అరటిపండు అస్సలు తినొద్దా



చలికాలం వచ్చిందంటే చాలు, పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే కఫం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. చలికాలం వచ్చిందంటే చాలు.. చిన్న పిల్లల తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఇలాంటప్పుడు వారి ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే శ్లేష్మం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ ఇందులో నిజమెంత? చలికాలంలో అరటిపండు పెట్టడం సురక్షితమేనా? నిజానికి జలుబు లేదా దగ్గు అనేవి వైరస్ల ద్వారా వచ్చే ఇన్ఫెక్షన్లు. ఏ పండు కూడా నేరుగా జలుబును కలిగించదు. అరటిపండు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరుగుతుందని నిరూపించడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అరటిపండు తిన్నప్పుడు గొంతులో కొంచెం బిగుతుగా అనిపించడం సహజం. అది కేవలం ఆ పండు ఆకృతి వల్ల కలిగే అనుభూతి మాత్రమే తప్ప కఫం కాదు. పిల్లలు జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు నీరసించి పోతుంటారు. ఏమీ తినడానికి ఇష్టపడరు. అలాంటి సమయంలో అరటిపండు వారికి ఒక వరంలా పనిచేస్తుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలకు తక్షణ శక్తిని ఇస్తుంది. అరటిపండు మెత్తగా ఉండటం వల్ల గొంతు నొప్పి ఉన్న పిల్లలు కూడా దీనిని సులభంగా తినగలరు. ఇందులోని విటమిన్ సి, విటమిన్ ః6 రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌తో పోరాడటానికి సహాయపడతాయి. శరీరంలోని ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడుతుంది.

పిల్లలకు అరటిపండు పెట్టినప్పుడు ఒకవేళ విరేచనాలు అవుతుంటే మాత్రం తాత్కాలికంగా ఆపేయడం మంచిది. చలికాలంలో ఏ ఆహారమైనా మితంగా ఇవ్వాలి. రోజుకు ఒకటి లేదా సగం అరటిపండును మ్యాష్ చేసి ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టిన అరటిపండ్లను నేరుగా పిల్లలకు ఇవ్వకండి. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పండ్లను మాత్రమే ఇవ్వండి. అరటిపండు ప్రకృతి మనకిచ్చిన ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్. అనవసరమైన అపోహలతో పిల్లలకు ఈ పోషకాలను దూరం చేయకండి. జలుబు చేసినప్పుడు ఆకలిగా లేని పిల్లలకు అరటిపండు ఒక మంచి ప్రత్యామ్నాయం.

## అనాస పువ్వు.. పవర్ ఫుల్ మెడిసిన్..!



అనాస పువ్వు (స్టార్ పువ్వు) వంటలకు రుచినివ్వడమే కాకుండా, అద్భుత ఆరోగ్య ప్రయోజనాల నిస్తుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. యాంటీవైరల్, యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలతో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది. పీరియడ్స్ సమస్యలు, చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. అనాస పువ్వు .. ఇది ఒకరకమైన సుగంధ ద్రవ్యం.. ప్రతి వంటింట్లోనూ తప్పనిసరిగా ఉంటుంది. దీనినే స్టార్ పువ్వు అని కూడా అంటారు. ఇది వంటలకు రుచిని ఇవ్వడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా మనం తీసుకున్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. పేగు కండరాల కదలికలను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను దరిచేరకుండా చేస్తుంది. అనాస పువ్వులో యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. జీర్ణశక్తిని పెంపొందించడంలో అనాస పువ్వు సహాయపడుతుంది. కడుపులో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. అనాస పువ్వు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. రక్తాన్ని శుద్ధి చేసి గుండెకు రక్త ప్రసరణను మెరుగుపర్చడం ద్వారా హృదయ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడంలో అనాస పువ్వు ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనివల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్‌తో బాధపడేవారు అనాస పువ్వును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తాయి. మహిళల్లో పీరియడ్స్ సమయంలో వచ్చే హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో అనాస పువ్వు ఉపయోగపడుతుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పులను కూడా తగ్గిస్తుంది. అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి.

# వాళ్లు దిగితే మెరుపులే

## టీ20 ప్రపంచకప్ మరో 3 రోజుల్లో

**బాదుడు.. ఉతుకుడు.. విధ్వంసం.. ఈ మాటలన్నీ వాళ్ల ఆట ముందు చిన్నబోతాయి. వాళ్లాడుతుంటే చూస్తోంది లైవా లేక హైలైట్సా అన్న అనుమానం కలుగుతుంది. కొన్ని ఓవర్లలోనే మ్యాచ్ గమనమే మారిపోతుంది. క్రీజులో ఉండేది కాసేపే అయినా.. స్టేడియంలో పరుగుల వర్షం కురుస్తుంది. అభిమానుల అరుపులతో హోరెత్తుతుంది. అలాంటి విధ్వంసక ఆటగాళ్లు ఈసారి టీ20 ప్రపంచకప్‌లో కొందరున్నారు. ఆ పవర్ హిట్టర్లెవరో చూద్దామా !**



### అభిషేక్ శర్మ

టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న ప్లేయర్లలో అత్యంత ఆకర్షణ ఉన్న ఆటగాడు అభిషేక్ శర్మ. ఈ నంబర్‌వన్ టీ20 బ్యాటర్.. గత కొన్నేళ్లుగా సంచలన ఆటతో చెలరేగుతున్నాడు. అతడికి తెలిసింది తొలి బంతి నుంచి బాదడమే. అభిషేక్ సిక్స్‌తోనే ఇన్నింగ్స్‌ను ఆరంభించిన సందర్భాలు చాలా ఉన్నాయి. మంచి నీళ్లు తాగినంత సులభంగా బంతిని స్టాండ్స్‌లోకి కొట్టేసే ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్.. టీ20ల్లో భారత్ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. మాజీ స్టార్ యువరాజ్ సింగ్ శిక్షణలో రాటుదేలిన అభిషేక్.. 2024 టీ20లో అరంగేట్రం చేసిన నాటి నుంచి టీమ్‌ఇండియాకు ఆయుధంగా మారాడు. పవర్ ప్లేలో ఆకాశమే హద్దుగా విరుచుకుపడుతున్న అతడు.. మ్యాచ్ గతిని మార్చేస్తున్నాడు. సెహ్వాగ్ మాదిరిగా ఉన్నంతసేపూ బలమైన ముద్రను వేస్తున్నాడు. ఆరంభంలో అభిషేక్ మెరుపులతో బలమైన పునాది పడడంతో.. తర్వాతి బ్యాటర్లు సైతం స్వేచ్ఛగా ఆడగలుగుతున్నారు. ఇప్పటిదాకా 38 టీ20ల్లో 194.74 సగటుతో 1297 పరుగులు చేశాడు అభి. అందులో 2 సెంచరీలు, 8 అర్ధసెంచరీలు ఉన్నాయి. అతడు ఉపయుక్తమైన లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ కూడా. ఇటీవల న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఫామ్‌ను కొనసాగించిన ఈ ఓపెనర్.. మూడో టీ20లో 14 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. జోరు మీద ఉన్న అతడు ప్రపంచకప్‌లో ఎలా ఆడతాడో చూడాలి.

### బేబీ డివిలియర్స్

### బ్రెవిస్

దక్షిణాఫ్రికా మాజీ స్టార్ ఏబీ డివిలియర్స్‌కు '360 డిగ్రీల ఆటగాడు' అని పేరు. మైదానంలోని అన్ని కోణాల్లో భారీ షాట్లు ఆడడంతో అతడికా పేరు వచ్చింది. ఏబీ రిటైర్ అయినా.. అతడి బాటలో మరో ఏబీ వచ్చాడు. డివిలియర్స్ మాదిరే మైదానం నలుమూలలా షాట్లు ఆడగల సామర్థ్యంతో చెలరేగుతున్న ఆ కుర్రాడి పేరు డెవాల్డ్ బ్రెవిస్. 2022 అండర్-19 ప్రపంచకప్‌తో ఈ కుడి చేతి వాటం బ్యాటర్ వెలుగులోకి వచ్చాడు. ఈ టోర్నీలో 6 మ్యాచ్‌ల్లో 506 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన బ్రెవిస్ అందరి దృష్టిలో పడ్డాడు. అదే ఏడాది ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ అతడిని రూ.3 కోట్లకు దక్కించుకుంది. గతేడాది అతడు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడాడు. 2023లో దక్షిణాఫ్రికా తరఫున టీ20ల్లో అరంగేట్రం చేసిన బ్రెవిస్.. ఈ ఏడాది ఎస్‌ఏ టీ20 టోర్నీలో 12 మ్యాచ్‌ల్లో 370 పరుగులు చేశాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో అతడిది రెండో స్థానం. ఎంతటి ఒత్తిడిలోనైనా తన శైలిలో దూకుడుగా ఆడడం అతడి శైలి. జోరు మీదున్న బ్రెవిస్‌పై దక్షిణాఫ్రికా చాలా ఆశలే పెట్టుకుంది.

### సాల్ట్

ఫిల్ సాల్ట్.. ఐపీఎల్‌ను అనుసరించే అభిమానులకు తెలుసు అతడి ఆటంటో! ధనాధన్ షాట్లతో విరుచుకుపడే ఈ కుడి చేతి వాటం బ్యాటర్.. తొలి బంతి నుంచే బాదుడు షురూ చేస్తాడు. స్పిన్, పేస్ అని తేడా లేకుండా పరుగుల పండగ చేసుకుంటాడీ ఇంగ్లాండ్ ప్లేయర్. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ గెలవడంలో సాల్ట్ (12 మ్యాచ్‌ల్లో 387 పరుగులు)ది కీలకపాత్ర. 2022 టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టులో సభ్యుడైన అతడు.. ఈసారి ఎలా ఆడతాడో చూడాలి. శ్రీలంకతో తాజా టీ20 సిరీస్‌లో సాల్ట్‌కు గాయమైనా.. కోలుకుని ప్రపంచకప్‌లో బరిలో దిగుతాడని ఇంగ్లాండ్ ఆశిస్తోంది. అతడితో ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇంగ్లాండ్ తరఫున 52 టీ20లు ఆడిన సాల్ట్.. 1587 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 7 అర్ధసెంచరీలు ఉన్నాయి.

### ట్రావిస్ హెడ్

2023లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్‌ను భారత్ గెలవలేదంటే.. ప్రధాన కారణం ట్రావిస్ హెడ్. ఈ ఆస్ట్రేలియా ఓపెనర్.. ఫార్మాట్ ఏదైనా విధ్వంసకంగా ఆడుతూ మ్యాచ్‌లను తన జట్టు వైపు లాగేస్తుంటాడుళి. ఇటీవల టీ20ల్లో మరీ గొప్పగా ఆడకపోయినా.. పెద్ద టోర్నీలకు వచ్చేసరికి ఈ హెడ్‌లోని మరో ఆటగాడు బయటకి వస్తాడు. 'క్లచ్ ప్లేయర్' అనే మాటకు పర్యాయ పదంగా నిలుస్తూ ఒత్తిడిలోనూ అదరగొడతాడు. భారత్‌తో పాటు ఈసారి మిగిలిన జట్లకూ టీ20 ప్రపంచకప్‌లో హెడ్‌తో కష్టమే. పవర్ ప్లేలో వికెట్లు పడినా.. తగ్గకుండా తన షాట్లు ఆడుతూ పోతాడు హెడ్. ప్రత్యర్థి తేరుకునేలోపే స్కోరు పెంచేస్తాడు. ఔటయ్యేలోపు చేయాల్సిన నష్టాన్ని చేసేస్తాడు. ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌లో అదరగొట్టిన హెడ్..10 ఇన్నింగ్స్‌ల్లో 629 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇదే ఫామ్‌ను టీ20 ప్రపంచకప్‌లోనూ కొనసాగించగలిగితే మిగిలిన జట్లకు కష్టమే.

### ఫిన్ అలెన్

భారత్‌తో తాజాగా తిరువనంతపురంలో జరిగిన అయిదో టీ20లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ మెరుపులను అభిమానులు మరిచిపోయి ఉండరు. 272 పరుగుల భారీ ఛేదనలో కివీస్ 220పైన పరుగులు చేసిందంటే అలెన్ విధ్వంసం వల్లే. అలవోకగా సిక్స్‌లు బాదేసే ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. కుదురుకుంటే నిమిషాల్లోనే ఆట గమనాన్ని మార్చేస్తాడు. 2018 అండర్-19 ప్రపంచకప్‌లో 338 పరుగులు చేసి సత్తా చాటిన అలెన్.. కెన్యాపై 19 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. 2024లో పాకిస్థాన్‌తో టీ20లో 48 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ఈ క్రమంలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (16) రికార్డు కూడా సమం చేశాడు. తాజాగా బిగ్‌బాష్ లీగ్‌లో 11 మ్యాచ్‌ల్లో 466 పరుగులు చేసి పెర్త్ స్కార్చర్స్ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. అదే ఊపులో ప్రపంచకప్‌లో అదరగొట్టాలని చూస్తున్నాడు. ఇప్పటిదాకా అలెన్ 53 టీ20ల్లో 2 సెంచరీలు, 6 అర్ధసెంచరీలతో 1365 పరుగులు చేశాడు.

## అఫ్గాన్‌తో భారత్ ఢీ

**అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్ నేడు**

**మధ్యాహ్నం 1 నుంచి**

హరారె: అండర్-19 ప్రపంచకప్‌లో అజేయ భారత్.. కీలక సమరానికి సిద్ధమైంది. వరుస విజయాలతో జోరు మీదున్న ఆయుష్ మాత్రే బృందం.. బుధవారం జరిగే సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌ను ఢీకొంటుంది. అయిదుసార్లు టైటిల్ గెలిచి ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్న భారత్.. ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆయుష్ సేనను అడ్డుకోవడం అఫ్గాన్‌కు చాలా కష్టమైన పనే. టోర్నీలో ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ భారత్ పెద్దగా ఇబ్బంది పడకుండానే గెలిచింది. గత మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 58 పరుగుల తేడాతో ఓడించిన ఆ జట్టు.. రెట్టించిన ఉత్సాహంతో ఉంది. వికెట్‌కీపర్ బ్యాటర్ అభిజ్ఞాన్ కుండు సూపర్ ఫామ్‌లో ఉండడం జట్టుకు గొప్ప సానుకూలాంశం. అతడు ఈ టోర్నీలో ఇప్పటివరకు 5 మ్యాచ్‌ల్లో 199 పరుగులు చేశాడు. ఇందులో రెండు అర్ధశతకాలు ఉన్నాయి. హిట్టర్ వైభవ్ సూర్యవంశీ (5 మ్యాచ్‌ల్లో 196) కూడా మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. కానీ అతడు అర్ధశతకాలను శతకాలుగా మలచాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. విహాన్ మల్హోత్రా (5 మ్యాచ్‌ల్లో 172) కూడా భారత్‌కు కీలకమే. ఈ టోర్నీలో ఇప్పటివరకు సెంచరీ కొట్టిన ఏకైక భారత బ్యాటర్ (జింబాబ్వేపై 109 నాటౌట్) అతడే. కెప్టెన్ ఆయుష్ మాత్రే పరుగుల బాట పట్టాల్సిన అవసరముంది. ఇప్పటివంకు అతడు ఆశించినంతగా రాణించలేకపోయాడు.



**నైరా బెనర్జీ యొక్క అద్భుతమైన రెడ్ చీర త్రోబ్యాక్**

# చరణ్ నుంచి మరో మాస్ ట్రీట్!



**షామా సికిందర్ అద్భుతంగా కనిపిస్తున్నాడు!**

ఆర్ఆర్ఆర్ తో గ్లోబల్ లెవెల్ లో గుర్తింపు తెచ్చుకున్నారు రామ్ చరణ్. ఆర్ఆర్ఆర్ తర్వాత భారీ అంచనాలతో వచ్చిన గేమ్ ఛేంజర్ డిజాస్టర్ అయిన సంగతి తెలిసిందే. గేమ్ ఛేంజర్ తర్వాత చరణ్ ప్రస్తుతం పెద్ది అనే సినిమా చేస్తున్నారు. ఉప్పెన మూవీతో మొదటి అవకాశంతోనే డైరెక్టర్ గా బ్లాక్ బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సాన ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

**షూటింగ్ దశలో పెద్ది**

విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న పెద్ది సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఈ సినిమాలో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నారు. ప్రస్తుతం పెద్ది షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఆల్రెడీ పెద్ది నుంచి రిలీజైన ఫస్ట్ గ్లింప్స్ తో పాటూ, చికిరి సాంగ్ కు ఆడియన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ రావడంతో మూవీపై అందరికీ మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

**పెద్ది తర్వాత సుకుమార్ తో చరణ్ సినిమా**

ఓ వైపు పెద్ది సినిమా షూటింగులో బిజీగా ఉంటూనే చరణ్ మరోవైపు తన తర్వాతి సినిమాపై ఫోకస్ చేశారు. పెద్ది తర్వాత చరణ్, సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. చరణ్ కెరీర్లో 17వ సినిమాగా రాబోతున్న ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి. దానికి కారణం గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్ గా నిలవడమే.

**చరణ్ కోసం రెండు కథలు సిద్ధం**

రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో రాబోతున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై మంచి బజ్ ఉంది. ఇదిలా ఉంటే పుష్ప2 తర్వాత నుంచి చరణ్ సినిమాపైనే కసరత్తులు చేస్తున్న సుకుమార్ మెగా పవర్ స్టార్ కోసం రెండు కథల్ని రెడీ చేశారని తెలుస్తోంది. తన రెగ్యులర్ స్టైల్ కు తగ్గట్టు ఓ క్లాస్ కథతో పాటూ, రంగస్థలం లాంటి ఓ మాస్ కథను కూడా రెడీ చేశారని టాక్ వినిపిస్తోంది.

**మాస్ కే ఓటేసిన చరణ్**

ఈ రెండింటిలో రామ్ చరణ్ మాస్ సినిమాకు ఓటు వేశాడని అంటున్నారు. అదే నిజమైతే రామ్ చరణ్ నుంచి మరో మాస్ ట్రీట్ రావడం ఖాయం. పుష్ప2 తర్వాత సుకుమార్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉంటాయి. కాబట్టి ఈ విషయాన్ని అతను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే సుకుమార్ కథతో పాటూ చరణ్ లుక్ విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఈ ఇయర్ సమ్మర్ నుంచి సినిమాను మొదలుపెట్టి, వచ్చే ఏడాది రిలీజ్ చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com